# ప్రజాశక్తి

శుక్రవారం 8 నవంబర్ 2024 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

# 43 వేల డబుల్ ఎంట్రీల తొలగింపు

## 3,00,587 మంది ఓటర్లుగా దరఖాస్తులు - పట్టభద్రుల ఓటర్ల చేరికపై ఎన్నికల కమిషన్ తుది ప్రకటన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి




శాసన మండలి పట్టభద్రుల నియోజకవర్గానికి ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ఓటర్ల నమోదు ప్రక్రియ బుధవారం సాయంత్రంతో ముగిసింది. మొత్తం 3,43,770 దరఖాస్తులు రాగా వీటిల్లో దాదాపు 43 వేల డబల్ ఎంట్రీలను తొలగించిన తరువాత గురువారం తుది జాబితాలను అధికారులు ప్రకటించారు. తాజా సమాచారం ప్రకారం మొత్తం 3,00,587 దరఖాస్తులను పరిశీలనకు తీసుకున్నారు. వీటిల్లో ఆన్‌లైన్ ద్వారా 2,83,433 దరఖాస్తులు, ఆఫ్‌లైన్ ద్వారా 17,155 దరఖాస్తులు ఉన్నాయి. అత్యధికంగా గుంటూరు జిల్లా నుంచి 93,908, ఎన్టీఆర్ జిల్లా నుంచి 62,069 దరఖాస్తులు వచ్చాయి. కృష్ణా జిల్లా నుంచి 55,847, బాపట్ల జిల్లా పరిధిలోని వేమూరు, రేపల్లె, బాపట్ల నియోజక వర్గాల నుండి 21,414, ఏలూరు జిల్లాలోనీ నూజివీడు, కైకలూర్ నియోజకవర్గాల నుంచి 15,158, పల్నాడు జిల్లా నుంచి 52,191 దరఖాస్తులు అందాయని అధికారులు గురువారం రాత్రి తెలిపారు. ప్రతి జిల్లా నుంచి సగటున 10 శాతం దరఖాస్తులను డబల్ ఎంట్రీలుగా గుర్తించారు. కొంతమంది ఆన్‌లైన్‌లో వేర్వేరుగా ఎక్కువ దరఖాస్తులు చేసినట్టు ఎన్నికల కమిషన్ స్టాఫ్‌వేర్ ద్వారా గుర్తించినట్టు అధికార వర్గాలు తెలిపాయి.

దరఖాస్తుల పరిశీలనను అధికారులు ప్రారంభించారు. బిఎల్‌వోలు, రెవెన్యూ అధికారులు ఇళ్లకు వెళ్లి దరఖాస్తులు పరిశీలన చేపట్టారు. ఇప్పటి వరకు కేవలం 6394 దరఖాస్తులను ఆమోదించారు. అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి

▶ 2లో

# విద్యుత్ భారాల పాపం గత ప్రభుత్వానిదే

- సబ్ స్టేషన్ ప్రారంభంలో సిఎం చంద్రబాబు
- సోషల్ మీడియాలో హద్దు మీరొద్దంటూ హెచ్చరికలు

వార్త మెయిన్‌లో

# సమస్యలపై నేటి నుండి సిపిఎం ప్రజాపోరు

4లో

# మిల్లుల్లో మంత్రి తనిఖీలు

- వెయ్యి టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం
- క్రిమినల్ కేసు నమోదుకు మంత్రి మనోహర్ ఆదేశం
- తనిఖీల సమాచారంతో పేరేచర్లలో రైస్‌బ్యాగ్ ట్యాగ్‌లు దహనం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి, సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి మండలం కొమెరపూడిలో రైసు మిల్లులో తనిఖీలు చేస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని 8 రైస్ మిల్లులను రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. వెలుగు చూసిన అక్రమాలపై మంత్రి అవాక్కయ్యారు. దాదాపు వెయ్యి టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి రామలింగేశ్వర ట్రేడర్స్ రైస్ మిల్లును తనిఖీ చేసిన మంత్రి వందలకొద్దీ రైస్ బ్యాగుల్లో రేషన్ బియ్యాన్ని గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేశారు. సత్తెనపల్లి రైస్ మిల్లులోనే 100 టన్నుల రేషన్ బియ్యాన్ని గుర్తించి తహశీల్దార్ చక్రవర్తిని ప్రశ్నించారు. జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో మెట్రాలజీ, సివిల్ సప్లయిస్ డిపార్ట్మెంట్ అధికారులు రైస్‌మిల్లులోని ప్రతి బ్యాగ్‌ని పరిశీలించాలని, పంచనామా అనంతరం క్రిమినల్ కేసులు నమోదు చేసి మిల్లును సీజ్ చేయాలని అధికారులను ఆదేశించారు.

సత్తెనపల్లి పట్టణంలో సీతారామాంజనేయ సాయి, గణేష్ రైస్‌మిల్ అండ్ ఫ్లోర్‌మిల్, శ్రీదేవి ట్రేడర్స్, రావు రైస్ అండ్ ఫ్లోర్ మిల్, సత్తెనపల్లి మండలం కొమెరపూడిలోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వర రైస్ మిల్లులను మంత్రి తనిఖీ చేశారు. గుంటూరు జిల్లాలో మేడికొండూరు మండలం పేరెచర్లలో మూడు రైస్ మిల్లులను మంత్రి తనిఖీ చేశారు. రైస్ మిల్లు ప్రాంతంలో రేషన్ సరఫరా చేసే వాహనాన్ని దాచి ఉంచిన వైనాన్ని చూసి మంత్రి ఆశ్చర్యపోయారు. వాహనాన్ని సీజ్ చేయాలని అధికారులను ఆదేశించారు. మంత్రి రాకను ముందుగానే తెలుసుకుని పేరేచర్ల వెంకటేశ్వర రైస్‌మిల్ ప్రాంగణంలో సిఎంఆర్ రైస్ బ్యాగ్ టాగ్‌లను నిర్వాహకులు దహనం చేశారు. మిల్లు సిబ్బందిని అదుపులోకి తీసుకోవాలని, పంచనామ నిర్వహించి కేసు నమోదు చేయాలని పోలీసులను మంత్రి ఆదేశించారు. గుంటూరు జిల్లాలోని విఘ్నేశ్వర రైస్‌మిల్లులో తనిఖీ చేసిన మంత్రి టార్చ్‌లైట్ వెలుగులో బియ్యం, రికార్డులు, 26 కిలోల బియ్యం బస్తాల తూకాన్ని పరిశీలించారు. రైస్ మిల్లు తనిఖీల కోసం సత్తెనపల్లి వచ్చిన మంత్రి రోడ్డు పక్కనే కారు

▶ 2లో

# త్వరలో 3 కొత్త క్రికెట్ అకాడమీలు

- మంగళగిరి స్టేడియం అభివృద్ధికి చెన్నయ్ కంపెనీతో చర్చలు
- అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో ఎసిఎ అధ్యక్షులు కేశినేని శివనాథ్

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

రాష్ట్రంలో మూడు క్రికెట్ అకాడమీలు పెట్టబోతున్నామని, ఇందులో అనంతపురంలో మహిళా అకాడమీ, విజయనగరంలో మెన్స్ అకాడమీ, విజయవాడ మూలపాడు స్టేడియంలో సీనియర్ మెన్స్ అకాడమీలు ఉంటాయని ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు, విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ తెలిపారు. బెంగుళూర్‌లో బిసిసిఐ ఏర్పాటు చేసిన సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ సెంటర్ తరహాలో ఈ మూడు క్రికెట్ అకాడమీలు ఉంటాయని చెప్పారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ మంగళగిరి ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం కార్యాలయంలో శివనాథ్ అధ్యక్షతన ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అపెక్స్ కౌన్సిల్ మీటింగ్ గురువారం జరిగింది. మంగళగిరి క్రికెట్ స్టేడియం అభివృద్ధితో పాటు, రాష్ట్రంలో క్రికెట్

▶ 2లో

## ఆస్పత్రుల్లో ఈసీజీ టెక్నీషియన్లను నియమించాలి

ప్రజాశక్తి - అమరావతి

డిప్లొమా, పారా మెడికల్ కోర్సుల్లో ఒకటైన ఈసీజీ టెక్నీషియన్ కోర్సు పూర్తి చేసిన వారు ఏటా వందల సంఖ్యలో ఉంటున్నా వారికి ఉపాధి కల్పించడంలో ప్రభుత్వాలు చొరవచూపడం లేదని పారామెడికల్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వి.రమేష్‌బాబు అన్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో ఏళ్లతరబడి నియామకాల చేపట్టలేదని చెప్పారు. ప్రతి ప్రభుత్వ ఆసుపత్రిలో ఈసీజీ టెక్నీషియన్ తప్పనిసరని, పేషెంట్‌కు అకస్మాత్తుగా ఛాతిలో నొప్పి వస్తే అది గుండె పోటా? లేదా గ్యాస్ వల్ల వచ్చిన నొప్పా? అని తెలియాలంటే ఈసీజీ ద్వారా నిర్ధారించాల్సి ఉంటుందని తెలిపారు. సిహెచ్‌సిలు, సిహెచ్‌సిలలో ఈసీజీ టెక్నీషియన్స్ లేనందువల్ల గుండె నొప్పి వచ్చిన వారిని 108 ద్వారా వందల కిలోమీటర్లలోని పెద్దాస్పత్రులకు తీసుకెళ్లాల్సి వస్తోందని తెలిపారు. ఇది కొన్ని సందర్భాల్లో నష్టానికి దారితీస్తోందన్నారు. దీనిపై ప్రభుత్వం ఆలోచించి అన్ని ప్రభుత్వాస్పత్రుల్లో ఈసీజీ టెక్నీషియన్లతో నియామకాలు చేపట్టాలని కోరారు.

## ప్రజల నుండి వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రజా సమస్యల పరిష్కారం, ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. నరసరావుపేట మండలం ములకలూరులో గురువారం ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వినతిపత్రాలు తీసుకున్నారు. చేపట్టాల్సిన అభివృద్ధిపై నాయకులు, అధికారులతో చర్చించారు.

## పేద విద్యార్థినికి 'స్నేహహస్తాలు' సాయం

ప్రజాశక్తి - అచ్చంపేట

నిరుపేద కుటుంబానికి చెందిన డిగ్రీ విద్యార్థి రాఘవ తిరుపతమ్మకు స్నేహహస్తాలు ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం రూ.25 వేల చెక్కును అచ్చంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ బి.సురేఖ అందజేశారు. ఈ సందర్భంగా స్నేహ హస్తాల ప్రతినిధి కరిముల్లాబాబు మాట్లాడుతూ మండలంలోని కొత్తపల్లికి చెందిన తిరుపతమ్మ 10వ తరగతి అచ్చంపేట జెడ్‌పి పాఠశాలలో చదివి ఇంటర్మీడియట్ అచ్చంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సిఇసి పూర్తి చేసిందన్నారు. తల్లిదండ్రుల ఆర్థిక స్థోమత లేకపోవడంతో ఆమెను కూలి పనులకు తీసుకెళుతున్నారని, ఆర్థిక ఇబ్బందుల వల్ల ఏ విద్యార్థీ చదువుకు దూరం కాకూడదని స్నేహ హస్తాలు ఫౌండేషన్‌ను ఎన్నారై ఎంవీ రావు కొంతమంది స్నేహితులతో కలిసి ఫౌండేషన్ స్థాపించారని చెప్పారు. వారి ఆశయాలకు అనుగుణంగా ఫౌండేషన్ గత సంవత్సరం తిరుపతమ్మను సత్తెనపల్లిలో ఎస్వీఆర్ డిగ్రీ కళాశాలలో బీకాం కంప్యూటర్స్ జాయిన్ చేశామని, బస్ ఫీజ్, కాలేజ్ ఫీజ్ నిమిత్తం ఈ ఏడాది రూ.25 వేలు ఇస్తామని వివరించారు. తిరుపతమ్మ కూడా ఉన్నత చదువులు చదివి మంచి ఉద్యోగంలో చేరి ఫౌండేషన్ కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అధ్యాపకులు గీతాగాయత్రి, శివన్నారాయణ పాల్గొన్నారు.

# జీవన శైలిలో మార్పుతో కేన్సర్ దూరం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

జీవనశైలిలో మార్పులు, ఒత్తిడి లేని జీవన విధానం, పౌష్టికాహారంతో కేన్సర్‌ను దూరంగా ఉంచొచ్చని పల్నాడు జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ బి.రవి అన్నారు. గురువారం జాతీయ కేన్సర్ అవగాహనా దినోత్సవం సందర్భంగా నరసరావుపేటలోని జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయం వద్ద అవగాహన ర్యాలీని డాక్టర్ రవి ప్రారంభించి మాట్లాడారు. వ్యాధిని ముందుగానే గుర్తిస్తే ప్రపంచవ్యాప్తంగా 40 శాతం కేన్సర్ మరణాలను నివారించొచ్చని చెప్పారు. పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని, వ్యాయామం చేస్తూ ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించాలని సూచించారు. దేశంలో కేన్సర్ పెరగడంతోపాటు అత్యంత సాధారణంగా కనిపించే రొమ్ము కేన్సర్, తల,మెడ, గర్భాశయ ముఖద్వారా, ఊపిరితిత్తులు, అండాశయ కేన్సర్లు కూడా ఎక్కువవుతున్నాయని తెలిపారు. జిల్లాలో త్వరలో ఎన్‌సిడి స్క్రీనింగ్ చేస్తామని చెప్పారు.

**వ్యాక్సిన్ ద్వారా నియంత్రణ**

స్క్రీనింగ్ ద్వారా లక్షణాలు లేకపోయినా కేన్సర్‌ను గుర్తించొచ్చని డాక్టర్ రవి చెప్పారు. రొమ్ము కేన్సర్ 40 ఏండ్లు పైబడిన మహిళల్లో మ్యామో గ్రామ్ ద్వారా, గర్భాశయ ముఖ ద్వారా కేన్సర్ పాపియర్ పరీక్ష ద్వారా ప్రారంభ దశలో గుర్తించి నయం చేయవచ్చని చెప్పారు. వ్యాక్సిన్ ద్వారా కొన్ని కేన్సర్లను నాయం చేయవచ్చన్నారు. గర్భాశయ ముఖద్వారా కేన్సర్ 9-26 ఏళ్ల వయస్సులో ఉన్న మహిళలకు హెచ్‌పివి వ్యాక్సిన్ ద్వారా నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ పద్మావతి, డాక్టర్ హనుమకుమార్, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ రవీంద్ర రత్నాకర్, డాక్టర్ రాజేశ్వరి, ఆశాలు, ఎఎన్‌ఎంలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - అమరావతి

జాతీయ క్యాన్సర్ డే సందర్భంగా మండలంలోని ధరణికోట ఆరోగ్య కేంద్రంలో అవగాహన సదస్సు, క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు గురువారం నిర్వహించారు. అత్తలూరు పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ డి.శివరత్నకుమార్ మాట్లాడుతూ పురుషుల్లో నోటి క్యాన్సర్, ఊపిరితిత్తులు, ఉదర క్యాన్సర్ కనిపిస్తూ ఉంటాయని, మహిళల్లో రొమ్ము క్యాన్సర్, గర్భాశయం ముఖద్వారా క్యాన్సర్ ఎక్కువగా ఉంటాయని చెప్పారు. బాధితుల్లో 60 శాతం మంది 35-65 ఏళ్లవారేనని, పొగాకు ఉత్పత్తుల క్యాన్సర్‌కు దారితీస్తాయని వివరించారు. డాక్టర్ ఎం.లీలాప్రసాద్ మాట్లాడుతూ ముందస్తు పరీక్షల ద్వారా క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే అరికట్టవచ్చన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్య విస్తరణ అధికారి కెఎల్ మా షాన్, జె.సామ్రాజ్యం, అరుణ శ్రీ, జై కృష్ణ, సిహెచ్ నాగ పుష్పలత, పి.హరిత, కె.అనిత, పి.దిశ, జి.కోటేశ్వరరావు, కె.రామారావు పాల్గొన్నారు.

నరసరావుపేటలో ర్యాలీ ప్రారంభిస్తున్న డిఎంహెచ్‌ఒ

# పిఎఎస్ కాలేజీని సందర్శించిన ఎన్ఆర్ఐలు

బాబురావును సత్కరిస్తున్న కళాశాల పాలకవర్గం

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్ : మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన తాను తల్లి ప్రోత్సాహంతో కష్టపడి ఇష్టపడి చదువుకొని ఇంగ్లండ్‌లో, అమెరికాలో 'హార్ట్ సర్జెన్'గా విశేష సేవలందిస్తున్నానని డాక్టర్ డి.బాబురావు అన్నారు. పెదనందిపాడులోని పిఎఎస్ కాలేజీని గురువారం సందర్శించిన ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ తాను ఎన్‌టిఆర్‌తోపాటు కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి శ్రీ రామకృష్ణహెగ్డేకు వైద్యసేవలు అందించానని చెప్పారు. ఇప్పుడు ఎన్నో సామాజికసేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. అందరూ కష్టపడి చదివి మంచి ఉద్యోగాలు సాధించాలని సూచించారు. మరో ఎన్అర్ఐ శేషబాబు మాట్లాడుతూ తాను ఎంఎస్‌సి, ఎంబిఎ పూర్తిచేసి ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డొమైన్‌లో 40 దేశాలలో పనిచేశానని, ప్రస్తుతం అమెరికా రెసిడెంట్‌గా ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్‌కు 'డైరెక్టర్ హెడ్ ఆఫ్ ఇన్వెస్ట్మెంట్స్', ఆంధ్రప్రదేశ్ నాన్-రెసిడెంట్ తెలుగు సొసైటీ మంగళగిరిలో చేస్తున్నానని చెప్పారు. ఉద్యోగ రంగాల్లో అవకాశాలపై వివరించారు. నందిపాఠశాల 550కు మించి మార్కులు సాధించే పదో తరగతి విద్యార్థులకు వచ్చేఏడాది నుండి లాప్ టాప్స్ అందిస్తామన్నారు. అనంతరం జి.రాయుడు మాట్లాడారు. అనంతరం కళాశాల పాలకవర్గ అధ్యక్షులు విశ్రాంత విజిలెన్స్ ఎస్పి.కాళహస్తి సత్యనారాయణ ఆతిథులకు గత 54 ఏళ్లుగా కళాశాల, పెదనందిపాడు మరియు పరిసర ప్రాంత విద్యార్థులకు అందిస్తున్న విద్యావకాశాలు వివరించానారు. రాబోవు సంవత్సరాలలో కొత్త కోర్సులు అందుబాటులోకి తెస్తామన్నారు. కళాశాల జాయింట్ సెక్రటరీ నర్రా బాలకృష్ణ, కమిటీ సభ్యులు దాసరి శేషగిరిరావు, సత్యనారాయణ, ప్రిన్సిపల్ వీరరాఘవయ్య, పీడీ పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

## 10న తైక్వాండో సబ్ జూనియర్ బాలబాలికల జిల్లాస్థాయి ఎంపికలు

ప్రజాశక్తి - మంగళగిరి : స్థానిక చింత క్రింది కనకయ్య హైస్కూల్ వద్ద జిల్లా స్థాయి సబ్ జూనియర్ బాల బాలికల తైక్వాండో ఎంపికలు ఆదివారం జరుగుతాయని గుంటూరు జిల్లా టైక్వాండో జనరల్ సెక్రటరీ పి.సుబ్బారావు గురువారం తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని తైక్వాండో క్రీడాకారులందరూ పాల్గొనొచ్చని, ఎంపికైన వారు ఈనెల 15, 16, 17 తేదీల్లో కందుకూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు.

## త్వరలో 3 కొత్త క్రికెట్ అకాడమీలు

(మొదటి పేజీ తరువాయి)

అభివృద్ధికి సంబంధించి 16 అంశాలపై చర్చించారు. మంగళగిరి క్రికెట్ స్టేడియం నిర్మాణంలోని లోపాలను సరిచేసేందుకు అహ్మదాబాద్ నరేంద్రమోదీ ఇంటర్నేషనల్ స్టేడియంకు పనిచేసిన పాపుల్యస్ చెన్నైకి చెందిన ఎన్.వి అసోసియేట్స్ ఆర్కిటెక్చర్ కంపెనీలతో మాట్లాడి సలహాలు సూచనలు తీసుకున్నారు. అనంతరం మీడియాతో శివనాథ్ మాట్లాడుతూ క్రీడా సదుపాయలు లేని గ్రామీణా ప్రాంతాల్లోనూ గ్రౌండ్స్ ఏర్పాటు చేయాలనుకుంటున్నట్లు చెప్పారు. ప్రతిభ గల క్రీడాకారులను గుర్తించి వీరు ఐపిఎల్‌లో, ఇండియన్ క్రికెట్ టీమ్‌లో సెలెక్ట్ అయ్యేలా కొత్త అకాడమీల్లో శిక్షణిప్పిస్తామని చెప్పారు. రాబోయే ఐపిఎల్ మ్యాచుల్లో ఏపీ నుంచి 20 మంది ఎంపికయ్యేలా ఇంటర్నేషనల్ క్రికెట్ ప్లేయర్స్‌తో శిక్షణ ఇప్పించే విధంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. రాబోయే ఐపీఎల్ సీజన్‌లో మ్యాచ్‌లు రాష్ట్రంలోనూ జరుగుతాయని, అందుకు వైజాగ్ స్టేడియన్ని సిద్ధం చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో క్రికెట్ టోర్నమెంట్‌లు పెంచే యోచనలో ఉన్నామన్నారు. అండర్-19 క్రికెట్ టోర్నమెంట్‌లు కూడా తీసుకు రాబోతున్నట్లు చెప్పారు. సౌత్ ఇండియాలో వున్న రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్స్‌తో మాట్లాడి ఇంకా టోర్నమెంట్స్ పెంచే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. విజయనగరం, వైజాగ్, విజయవాడ, మంగళగిరి, అనంతపురం కడప స్టేడియాల్లో ఈ మ్యాచ్‌లు నిర్వహిస్తామని చెప్పారు. మంగళగిరి క్రికెట్ స్టేడియంలో ఇంటర్నేషనల్ మ్యాచ్‌ల నిర్వహణకు వీలుగా కృషి చేస్తున్నామన్నారు. ఈ స్టేడియం 12 ఏళ్ల క్రితం డిజైన చేసిన దృష్ట్యా నిర్మాణంలో చాలా లోపాలున్నాయని, పార్కింగ్ సదుపాయం లేదని చెప్పారు. ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం పార్కింగ్‌కు బిసిసిఐ నిబంధనలు ప్రకారం 14 ఎకరాలు ఉండాలన్నారు. ఇంటర్నేషనల్ మ్యాచ్‌లు జరగాలంటే మంచి స్పోర్ట్స్ సెంటర్ వుండాలని తెలిపారు. వీటిన్నింటికి 35 ఎకరాలు అవసరం కాగా ఇప్పటికే ప్రభుత్వానికి, సిఆర్‌డిఎకు విజ్ఞప్తి చేశామని, ఇవ్వటానికి వారు సిద్ధంగా వున్నారని తెలిపారు. స్టేడియం మార్గంలో రహదారుల అభివృద్ధిపై దృష్టి పెట్టామన్నారు. నాలుగు నెలల్లో వెస్టన్ బైపాస్ పూర్తవుతుందని, ఆ బైపాస్ నుంచి స్టేడియంకు రోడ్ వచ్చే విధంగా ప్రతిపాదనలు పెట్టామని తెలిపారు. స్టేడియంకు సీడ్ యాక్సెస్ రోడ్ లింక్ చేసేలా కృషి చేస్తున్నామన్నారు. మంగళగిరి-నిడమర్రు రైల్వే గేట్ దగ్గర నాలుగు వరుసల ఆర్.వో.బి ప్రతిపాదనలు పెట్టామన్నారు. స్టేడియం సిద్ధమయ్యేలోగా ఇవన్నీ పూర్తవుతాయని చెప్పారు. సమావేశంలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ పి.వెంకట రామ ప్రశాంత్, సెక్రటరీ సానా సతీష్, కోశాధికారి దండమూడి శ్రీనివాస్, కౌన్సిలర్ దంతుగౌరు విష్ణు తేజ్ పాల్గొన్నారు.

## 43 వేల డబుల్ ఎంట్రీల తొలగింపు

(మొదటి పేజీ తరువాయి)

పరిధిలో 2,68,029 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఆఫ్‌లైన్‌లో దాఖలు చేసిన వాటిల్లో ఇప్పటి వరకు కేవలం 728 దరఖాస్తులనే ఆమోదించగా పెండింగ్‌లో 16,427 ఉన్నాయి. అయితే 2019లో జరిగిన ఎన్నికల్లో దాదాపు 2.50 లక్షల మంది ఓటర్లు నమోదు కాగా మూడు లక్షల వరకు నమోదు కావడంలో ప్రధాన పార్టీల అభ్యర్థులు కీలక భూమిక పోషించారు. ప్రధాన పోటీ దారులుగా ఉన్న అభ్యర్థులు కెఎస్ లక్ష్మణరావు (పిడిఎఫ్), ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ (టిడిపి)లు ఎక్కువ మందిని చేర్పించగలిగారు. వైసిపి నుంచి పి.గౌతంరెడ్డి (వైసిపి)ల వారి అనుచరులు, పార్టీల కార్యకర్తలు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి ఓటర్ల నమోదు ప్రచారం చేశారు. అయితే ఈ ఎన్నికల నుంచి తప్పుకుంటున్నట్టు వైసిపి రాష్ట్రనేతలు ప్రకటించారు.

దరఖాస్తుల పరిశీలన తరువాత నవంబరు 23న డ్రాఫ్టు నోటిఫికేషన్ జారీ చేస్తారు. డిసెంబరు 9 వరకు అభ్యంతరాలు, మార్పులు, చేర్పులు చేపడతారు. డిసెంబరు 30న తుది జాబితా ప్రచురిస్తారు. కొన్ని ప్రాంతాల్లో టెన్తు, ఇంటర్ సర్టిఫికెట్లు తప్పని సరిగా ఉండాలన్న షరతుతో పాటు ధృవపత్రాలపై గెజిటెడ్ అధికారి ధ్రువీకరణ తప్పనిసరి అని షరతు పెట్టడం వల్ల కొంతమంది దరఖాస్తు చేయలేకపోయారని తెలిసింది. టెన్తు, ఇంటర్‌తో సంబంధం లేకుండా 2021కి ముందు డిగ్రీ పూర్తయినట్టు ధ్రువపత్రాలుంటే సరిపోతుందని ఉన్నతాధికారులు స్పష్టం చేసినా కొన్నిచోట్ల అవగాహన లోపం వల్ల దరఖాస్తులు చేయలేకపోయారు.

## మిల్లుల్లో మంత్రి తనిఖీలు

(మొదటి పేజీ తరువాయి)

ఆపించి బడ్డీ కొట్టు వద్ద టీ తాగారు. అక్కడ సామాన్యులతో మాట్లాడి నిత్యావసర ధరలపై ఆరా తీశారు. చివరిగా ప్రత్తిపాడులో మిల్లును తనిఖీ చేశారు. ప్రత్తిపాడు నుంచి మహారాష్ట్రకు రేషన్ బియ్యం ఎగుమతి అవుతున్నట్టు గుర్తించారు.

**అర్హతున్న అందరికీ దీపం పథకం-2 : మనోహర్**

రాష్ట్రంలో కోటి 55 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి దీపం పథకం-2 వర్తిస్తుందని మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 23 లక్షల మంది వినియోగదారులు గ్యాస్ బుక్ చేసుకోగా 16 లక్షల మందికి గ్యాస్ సిలిండర్లు డెలివరీ చేశామని, ఇప్పటివరకు రూ.84 కోట్లు ఖర్చు చేశామని చెప్పారు. రాష్ట్రంలో కోటి 47 లక్షల రేషన్ కార్డుదారులకు ఉచితంగా రేషన్ బియ్యం సరఫరా చేస్తున్నామన్నారు. కిలోకు రూ.43.40 ఖర్చును ప్రభుత్వాలు భరిస్తుంటే ఈ బియ్యాని రేషన్ మాఫియా విదేశాలకు తరలిస్తోందని అన్నారు. మంత్రి వెంట పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ సురజ్ గనోరే, సత్తెనపల్లి ఆర్‌డిఒ జి.రమాకాంతరెడ్డి, జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి నారదముని, తునికల కొలతల శాఖ అధికారులు ఉన్నారు.

## నాణ్యతలేని మందుల విక్రయాలు ఆందోళనకరం

ప్రజాశక్తి-గుంటూరు

మార్కెట్లో విరివిగా దొరికే 50కి పైగా మందులలో నాణ్యత లేదని సెంట్రల్ డ్రగ్ స్టాండర్డ్స్ కంట్రోల్ ఆర్గనైజే షన్ తాజా సర్వేలో గుర్తించినా మార్కెట్లో వీటి విక్రయం, వినియోగము ఆందోళన కలిగి స్తున్నాయని సీసీఐ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ చదలవాడ హరిబాబు అన్నారు. గర్తపురి కన్స్యూమర్స్ మీట్ ది ప్రెస్‌లో ఆయన మాట్లాడుతూ ఈసర్వేలో ప్రముఖ కంపెనీలు విక్రయించే మందులు కూడా ఉన్నాయని ఉదాహరణకు సన్ ఫార్మసిటికల్స్ తయారు చేసిన పుల్మోసిల్ సిల్డెనాఫిల్ ఇంజక్షన్ నాణ్యత లేనిదిగా, యాసిడ్ రిఫ్లక్స్, అజీర్తికి సాధారణంగా ఉపయోగించే పాంటాసిడ్, గ్లెన్మార్క్ ఫార్మాసిటికల్స్ ద్వారా రక్తపోటును నియంత్రించడం కోసము ఉపయోగించే తెల్మిసర్తన్ 40యంజి, హైడ్రోక్లోరోతియాజైడ్ 12.5యంజి టాబ్లెట్ ఉన్నాయన్నారు. ప్రియారెడ్డి మాట్లాడుతూ వెంటిలేటర్ బెడ్, ఆక్సిజన్‌బెడ్, యాంజియోగ్రామ్, బాడీస్కాన్‌కు నిర్ణయించిన ఉత్తర్వులను ప్రైవేట్ కార్పొరేట్ ఆసుపత్రులు ముఖ ద్వారము వద్ద డిస్‌ప్లే బోర్డును ఆసుపత్రి వారు ఏర్పాటు చేయకపోయినా సంబంధిత అధికారులు వారిపై కేసులు దాఖలు చేయకపోవడం బాధాకరమని అన్నారు. కార్యక్రమంలో ఎస్.కె.రిజ్వాన్ వినియోగదారుల సంఘాల ప్రతినిధులు హాజరై ప్రసంగించారు.

## ఆచార్య ఎన్జీ రంగాకు ఘన నివాళి

ప్రజాశక్తి-గుంటూరు

స్వాతంత్ర సమరయోధుడిగా ఆరు శతాబ్దాల సుదీర్ఘ పార్లమెంటేరియన్‌గా, రైతు సమస్యలపై జీవితకాలం పోరాటం చేసి నాయకుడిగా గుర్తింపు తెచ్చుకున్న ఆచార్య ఎన్.జి.రంగా జీవితం వర్తమాన, భావితరాలకు స్ఫూర్తిదాయకమని ప్రముఖ సాహితీవేత్త ముత్తేవి రవీంద్రనాథ్ పేర్కొన్నారు. ఆచార్య ఎన్.జి.రంగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్జీరంగా 124వ జయంతి వేడుకలు, సాహిత్య పురస్కార ప్రధానోత్సవ సభ 2024 స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానం, పద్మావతి కళ్యాణ వేదికపై గురువారం ఘనంగా నిర్వహించారు.రవీంద్రనాథ్ మాట్లాడుతూ ఆచార్య రంగా విదేశీ విశ్వవిద్యాలయాలలో చదివినా కానీ మహాత్మా గాంధీ సిద్ధాంతాలను పుణికిపుచ్చుకొని గొప్ప దేశభక్తుడిగా, చివరి వరకు స్వాభిమానంతోనే ప్రజల మనిషిగా నిరాడంబర జీవితాన్ని గడిపారన్నారు. సభకు అధ్యక్షులు వహించిన ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ జక్కంపూడి సీతారామారావు మాట్లాడుతూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోనే తొలిసారిగా తెలుగు మహిళా రచయిత్రుల నుండి కథల పోటీలకు ఆహ్వానించగా పెద్ద ఎత్తున స్పందన వచ్చిందన్నారు. పురస్కార గ్రంథ సమీక్ష డాక్టర్ వి నాగరాజ్యలక్ష్మి చేశారు. ఈ సందర్భంగా కథల పోటీల్లో ప్రథమ బహుమతి 'బతుకు సేద్యం' రచయిత్రి శాంతి ప్రబోధ, ద్వితీయ బహుమతి పి.సుజాత 'పచ్చబొట్టు', విశిష్ట బహుమతి 'నీలంపు రాసి' రచయిత్రి చంద్ర ప్రభ లను సత్కరించి నగదు పురస్కారం అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం పాలకమండలి అధ్యక్షులు మస్తానయ్య, డాక్టర్ కందిమళ్ల సాంబ శివరావు, డాక్టర్ డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, డాక్టర్ వెన్నిశెట్టి సింగారావు పాల్గొన్నారు.

## చోరీ కేసుల్లో ఒకరు అరెస్ట్

**రూ.7.5 లక్షల బంగారం, వెండి ఆభరణాలు స్వాధీనం**

**ప్రజాశక్తి-తెనాలిరూరల్ :** ఒకే ప్రాంతంలో ఐదు చోరీలకు పాల్పడిన అంతరజిల్లాల దొంగను పోలీసులు గురువారం అరెస్టు చేశారు. తెనాలి మూడవ పట్టణ పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో సిఐ ఎస్ రమేష్ బాబు వివరాలు వెల్లడించారు. విజయవాడ నెహ్రూ బొమ్మ సెంటర్ రాజగిరి వారి వీధికి చెందిన గుదే హరీష్ కుమార్(29) చెడు వ్యసనాలకు బానిసై ఈజీ మనీకి అలవాటు పడ్డాడు. వృత్తిరీత్యా టాక్సీ డ్రైవర్ కావడంతో అనేక పర్యాయాలు తెనాలి బాలాజిరావు పేట బాడుగలకు వచ్చేవాడని పోలీసులు తెలిపారు. ఈ నేపథ్యంలో రాత్రిపూట తాళాలు లేని ఇళ్లను హరీష్ రెక్కి నిర్వహించేవాడు. విజయవాడ నుంచి తెనాలికి అర్ధరాత్రి రైళ్లలో వచ్చేవాడు. ముందుగానే రెక్కి నిర్వహించిన ఇళ్ల వెనుక భాగంలో గేటుతాళాలను పగలుగొట్టి ఇంటిలోకి చొరబడేవాడు. ఇంట్లో లభిం చిన బీరువా, కప్ బోర్డ్ తాళాలుతోనే చోరీ చేసి పరారయ్యేవాడన్నారు. చోరీ చేసిన బంగారాం, వెండి ఆభరణాలను విజయవాడ గవర్నరు పేటలోని కొందరు బంగారం కరిగించే వ్యక్తులకు విక్రయించేవాడని పోలీసులు తెలిపారు. ఇలా వచ్చిన నగదుతో గోవా వెళ్లి జల్సా చేసే వాడన్నారు. ఇలా చోరీసొత్తును విక్రయించే క్రమంలో నవంబరు 6న తెనాలిలో అరెస్టుచేసి నిందితుడి నుంచి 100 గ్రాముల బంగారం, 55 గ్రాముల వెండిని స్వాధీన పరచుకున్నట్లు రమేష్ బాబు తెలిపారు. కేసులో మరికొందరిని పూర్తి ఆధారాలతో అరెస్ట్ చేసి బంగారాన్ని స్వాధీనపరచుకోవాల్సి ఉందన్నారు. చోరీ సొత్తు విలువ మార్కెట్లో రూ. 7.5 లక్షలు ఉంటుందన్నారు. కేసును ఛేదించిన ఎస్సై ఎన్ ప్రకాశరావు, ఎ ఎస్ ఐ హైదర్ అలీ, పిసి లు పి మురళి, ఎస్ జైకర్ బాబు లను ఎస్పి అభినందించారని, వారికి నగదు ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు.

## గుర్తుతెలియని వ్యక్తి మృతి

**ప్రజాశక్తి - మాచర్ల :** గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన మాచర్ల పట్టణంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం బుధవారం స్థానిక 13వ వార్డులో అపస్మారక స్థితిలో పడివున్న వ్యక్తిని మానవతా దృక్పదంతో స్థానికులు శ్రీరామకృష్ణా సేవాసమితి అధ్యక్షులు మెట్టుగోవిందరెడ్డి సహకారంతో ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. ప్రథమ చికిత్స అనంతరం అతనికి మెరుగైన చికిత్స అందించేందుకు గుంటూరు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అతను మరణించాడు. పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు జరుపుతున్నారు.

**దావా నోటీసు.**

**మహారాజశ్రీ తెనాలి అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో**

**O.S. 68/2023.**

వాది: పాపోలు శ్రీనివాస రావు.

VS

ప్రతివాదులు:
1) శ్రీమతి.కొలకలూరి ముత్యాలమ్మ.
2) శ్రీమతి. పెటేటీ సింధు.
3) శ్రీమతి. కనపాల హర్షిత.

To

**1వ ప్రతివాది:** శ్రీమతి కొలకలూరి ముత్యాలమ్మ W/o లేటు సత్యం బాబు, అంగలకుదురు, తెనాలి మండలము, గుంటూరు జిల్లా.

మీలో 1వ వారి భర్త 2,3 వారల తండ్రి గారైన లేటు కొలకలూరి సత్యం బాబు వాది పేర వ్రాసిన A,B,C,D,E మార్కు ప్రామిసరీ నోట్ల బాకీ మొత్తము అసలు, వడ్డీతో సహా అయిన మొత్తం రు 30,70,983/- రాబట్టుకునే నిమిత్తము లేటు కొలకలూరి సత్యంబాబు చనిపోయినందున ఆయనకు ముఖ్య వారసులైన మీపై వాది దావా చేయగా మీకు నోటీసు నిమిత్తము ది 18-11-2024 తేదీకి వాయిదా వేసినారు. గాన మీరు వాయిదా రోజు ఉదయం 10-30 నిముషముల తర్వాత మీరు స్వయముగా గానీ, మీ తరపు అడ్వకేట్ గారి ద్వారాగానీ పిలిచినప్పుడు కోర్టులో హాజరై మీ తరపు ఆక్షేపణలు తెలుపు కోవలెను లేని ఎడల మీ పరోక్షమందు తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియ చేయటమైనది.

తెనాలి.
08-11-2024

ఇట్లు
**కోగంటి శివశంకరరావు**
**వాది తరపు అడ్వకేట్.**

## న్యాయస్థానాల తీర్పును అమలు చేయాలి

**కొనసాగుతున్న ఎసిసి కార్మికుల ఆందోళన**

ప్రజాశక్తి-తాడేపల్లి

ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం న్యాయస్థానాల తీర్పులైన గౌరవించి తమకు న్యాయం చేయాలని ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ యూనియన్ నాయకులు కు రపాటి స్టీవెన్ కోరారు. న్యాయంగా తమకు రావాల్సిన నష్టపరిహారం ఇవ్వాలని సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న ఆందోళన గురువారం నాటికి పదో రోజుకు చేరు కొంది. ఈ సందర్భంగా దీక్ష శిబిరంలో కార్మికుల ఉద్దేశించి స్టీవెన్ మాట్లాడారు. మేము మనుషులమే అనే విషయాన్ని యాజమాన్యం గుర్తించాలని కోరారు. మా కష్టానికి తగ్గ ప్రతిఫలం అడుగుతున్నాను తప్ప, మేమేమి బిక్షం అడగడం లేదని స్పష్టం చేశారు. ఇప్పటిదాకా 200 కోట్లు విలువచేసే ఫ్యాక్టరీ భూమిని తాము కాపాడామని, నష్టపరిహారం కింద తమకు భూమి ఇస్తారా, నగదు రూపంలో ఇస్తారా ఏదో ఒకటి చెప్పాలని డిమాండ్ చేశారు. 33 ఏళ్ల కింద అక్రమంగా లాకౌట్ చేసిన కంపెనీ యాజమాన్యం ఆ నెల పనిచేసిన కార్మికులకు కూడా జీతాలు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయస్థానాల తీర్పునైనా పరిగణలోకి తీసుకొని తమకు న్యాయం చేయాలని శాంతియుతంగా తమ ఆందోళన చేస్తున్నామని చెప్పారు. సమస్య పరిష్కారం అయ్యేంతవరకు ఆందోళన చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మిక కుటుంబాల నుండి బి అంకయ్య, ఆశీర్వాదం, సూరి, నవనీతం, రమాదేవి, ఇమాంబి, శారద, సుబ్బారావు, సాంబయ్య, పాల్గొన్నారు.

## విజయ హెల్త్‌కేర్ ట్రస్ట్ వితరణ

**ప్రజాశక్తి - మంగళగిరి :** మంగళగిరి పట్నంలోని 28వ వార్డు దళిత శిబిరానికి చెందిన రాజారత్నం, మరియమ్మ అను నిరు పేదదంపతులకు విజయ హెల్త్ కేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి నిత్యవసర సరు కులు పంపిణీ చేశారు. అనారోగ్యం కారణంగా రోజువారి పనులు కూడా చేసుకోలేక తినడానికి తిండి లేక నాన్న ఇబ్బందులు పడుతున్నారన్న

విషయం తెలుసుకున్న ట్రస్ట్ ఫౌండర్ కాగితాల స్వాతి నెలకు సరిపడా సరుకు లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో, తాళ్ల చెంచురెడ్డి, నూతక్కి నాగబాబు, సత్యానందం, కోపూరు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం సీజ్

**ప్రజాశక్తి - పెదకూరపాడు :** రేషన్ బియ్యం ఐదు క్వింటాలు సీజ్ చేసినట్లు పెదకూరపాడు ఎస్సై గిరిబాబు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మండలం లోని తాళ్లూరు శివారు లో 16 గోతాలలో సుమారు 5 క్వింటాలు అక్రమంగా తరలిస్తున్నారని సమా చారం రావడంతో పట్టుకున్నట్లు తెలిపారు. మండలం లోని బలుసుపాడు గ్రామానికి చెందిన బలుసుపాటి బాజీ, గంజిమాల విజయ్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

**జనరల్ నోటీసు**

**మహారాజశ్రీ శ్రీ గురజాల సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో**

**I.P No. 48 / 2024**

బిట్వీన్:
పొట్లూరి చుక్కయ్య ...పిటీషనరు

మరియు

షేక్ జానీబాషా మరియు 9 ఇతరులు. ....రెస్పాండెంట్లు

1)షేక్ జానీ బాషా, S/o.బూరి సాహెబ్, ముస్లిం, కిరణ్ షాప్ BC కాలనీ, Opp. ఆంజనేయ స్వామి టెంపుల్, R/o. చింతపల్లి-గ్రామం, కారెంపూడి- మండలం, పల్నాడు-జిల్లా. 2)ఇంజమూరి రాజ్యం, D/o. కోటిస్వరమ్మ, S.T. కాలనీ, Opp.పల్లెపోగు ముత్తయ్య హౌస్, R/o. చింతపల్లి,-పోస్ట్, కారెంపూడి మండలం, పల్నాడు-జిల్లా,3)వల్లెపు రమణ, W/o. వెంకటయ్య, Opp. పిచ్చయ్య మాస్టరు హౌస్, B.C. కాలనీ,Opp. చింతపల్లి-గ్రామం, కారెంపూడి మండలం, పల్నాడు-జిల్లా. 4)ఉప్పుతోల్ల లక్ష్మి, W/o.శ్రీను, బత్తుల గురమ్మ ఇంటి దగ్గర B.C.కాలనీ, R/o.చింతపల్లి-గ్రామం, కారెంపూడి మండలం, పల్నాడు-జిల్లా. 5)వేల్పుల కోటేశ్వర రావు, S/o.వెంకయ్య, వేల్పుల మోసయ్య ఇంటి వెనుక వైపు S.C. కాలనీ, R/o. చింతపల్లి-గ్రామం, కారెంపూడి మండలం, పల్నాడు-జిల్లా,6)వేల్పుల శాంతమ్మ, భర్త ఆక్కేస్వర రావు, S.C. కాలనీ, R/o. చింతపల్లి-గ్రామం, కారెంపూడి- మండలం, పల్నాడు-జిల్లా, 7)ఇరుగుల రాంబాబు,S/o.రామయ్య, పిచ్చయ్య మేస్త్రి ఇంటి దగ్గర, B.C.కాలనీ, R/o. చింతపల్లి- గ్రామం, కారెంపూడి-మండలం, పల్నాడు-జిల్లా,8)వేంపోగు మాణిక్యం, S/o.వెంకయ్య, S.C. కాలనీ, R/o.చింతపల్లి-గ్రామం, కారెంపూడి-మండలం, పల్నాడు-జిల్లా,9)బత్తుల అంకమ్మ, W/o. శ్రీను, సూరె కొండమ్మ ఇంటి ఎదురు, B.C. కాలనీ, R/o.చింతపల్లి-గ్రామం, కారెంపూడి-మండలం, పల్నాడు-జిల్లా,10)బత్తుల సుబ్బారావు, ఇరుగుల రాంబాబు ఇంటి ఎదురు,B.C.కాలనీ, B.C.చింతపల్లి-గ్రామం, కారెంపూడి-మండలం, పల్నాడు-జిల్లా.

సదరు పిటీషనర్ పైన పేర్కొన్న శ్రీ కోర్టు వారి ఎదుట I.P. పిటిషను దాఖలు చేయగా శ్రీ కోర్టు వారు జనరల్ నోటీసు నిమిత్తము పేపరు ప్రకటనకు ఆర్డరు వేసియున్నారు. మీరు ఆక్షేపణలు తెలుపుకొనుటకు శ్రీ కోర్టువారు **ది.14-11-2024** తేదికి వాయిదా వేసియున్నారు. కావున సదరు వాయిదా రోజు **ఉ॥గం॥10-30ని॥**లకు మీరు స్వయంగా గాని,వకీలు ద్వారా గాని,హాజరయి మీకుగల ఆక్షేపణలు తెలుపుకొనగలరు.లేని యెడల సదరు పై నెంబరు కేసును మీ పరోక్షమందు తీర్మానించ బడును. **వాయిదా తేది: 14-11-2024**

**కొంగర హరి సత్యనారాయణ,**
**పిటీషనర్ తరపున న్యాయవాది, గురజాల, పల్నాడు జిల్లా.**

**BEFORE THE COMMISIONER FOR EMPLOYEES COMPENSATION & ASST COMMISSIONER OF LABOUR -- II, TWIN CITIES T.ANJAIAH BHAVAN,RTC X ROADS, AT:HYDERABAD.**

**E.C.NO.12 OF 2024**

BETWEEN:
B.Surykumar,S/o.B.Prakash Rao, R/o. H.No.2-3-48,Amberpet,Hyderabad. ...Appellant

AND

M.Suverchala Devi and Others ...Opposite Parties

To,
1.M.Suvarchala Devi,D/o.Raghunadha Babu,R/o.H.No.17-4-16/3,Narsarao Pet, Guntur Dist ...Opposite Parties

Please take notice that the above named applicant filed E.C. against you and others for compensation praying that the Hon'Ble court for grant of compensation in favour of the petitioners. The Hon'Ble court posted the above case on **25-11-2024** at **3** P.M. for your appearance either in person or through an advocate failing which the case will be heard and decided on merits in your absence.

(BY ORDER OF THE COURT)

**S.INDRASEN REDDY,**
Advocate
Flat No.401,H.No.16-11-741/B2 ,Vinayaka Towers,Moosarambagh,Hyderabad.

**Order 38 rul 5**

**జప్తు నోటీసు.**

**మహారాజశ్రీ తెనాలి అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో**

**I.A.582/2023 IN O.S.68/2023.**

పిటిషనర్ - వాది: పాపోలు శ్రీనివాస రావు

VS

రెస్పాండెంట్స్- ప్రతివాదులు:
1) శ్రీమతి.కొలకలూరి ముత్యాలమ్మ.
2) శ్రీమతి. పెటేటీ సింధు.
3) శ్రీమతి. కనపాల హర్షిత.

To

**1వ రెస్పాండెంట్- ప్రతివాది:** శ్రీమతి కొలకలూరి ముత్యాలమ్మ W/o లేటు సత్యంబాబు, అంగలకుదురు, తెనాలి మండలము. గుంటూరు జిల్లా.

మీలో 1వ వారి భర్త 2,3 వారల తండ్రి గారైన లేటు కొలకలూరి సత్యం బాబు వ్రాసిన A,B,C,D,E మార్కు ప్రామిసరీ నోట్ల బాకీ మొత్తము అసలు, వడ్డీతో సహా అయిన మొత్తం రు 30,70,983/- రాబట్టుకునే నిమిత్తము లేటు కొలకలూరి సత్యం బాబు చనిపోయి నందున ఆయనకు ముఖ్య వారసులైన మీపై పిటిషనరు - వాది దావా చేసి మీ తాలూకు పిటిషన్ షెడ్యూలు దాఖలా ఆస్తిని ఫైలు జప్తు చేయించమని కోరుచూ పిటిషనర్ -వాది I.A.582/2023 నెంబరు పిటిషన్ దాఖలు చేయగా మీకు నోటీసు నిమిత్తము ది. 18-11-2024 తేదీకి వాయిదా వేసినారు. గాన మీరు వాయిదా రోజు ఉదయం 10-30 నిముషముల తర్వాత మీరు స్వయముగా గానీ,మితరపు అడ్వకేట్ గారి ద్వారాగానీ పిలిచినప్పుడు కోర్టులో హాజరై మీ తరపు ఆక్షేపణలు తెలుపు కోవలెను లేని ఎడల మీ పరోక్షమందు తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియ చేయటమైనది.

తెనాలి.
08-11-2024

ఇట్లు
**కోగంటి శివశంకరరావు**
**వాది తరపు అడ్వకేట్.**

## కొండచిలువ కలకలం

**ప్రజాశక్తి దుగ్గిరాల :** సహజంగా కొండ ప్రాంతంలో అడవులలో కనిపించే కొండచిలువ అకస్మాత్తుగా డెల్టా ప్రాంతంలో కనిపించడంతో ప్రజలు భయ్రబ్రాంతులకు గురయ్యారు. మండలంలోని పెనుమూలి, గాంధీనగరం గ్రామాల మధ్య గురువారం ఉదయం రోడ్డుపై కొండచిలువ కనిపించడంతో ప్రజలు భయానికి గురయ్యారు. కొంతసేపు ట్రాఫిక్ నిలిచిపోయినది. స్థానిక యువకుల కొందరు కొండచిలువను చంపివేశారు. సుమారు 9 అడుగుల పొడవు ఉన్నట్లు తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు డిఆర్ బిసి డ్రైన్ లో కొట్టుకొచ్చి ఉంటుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

## దేవాలయంలో చోరీ కేసులో ఆరుగురు అరెస్టు

**ప్రజాశక్తి అచ్చంపేట :**అచ్చంపేట మండల పరిధిలోని మాదిపాడు సత్తమ్మ తల్లి దేవాలయంలో దొంగతనానికి పాల్పడిన చోరులపై కేసు నమోదు చేసి సత్తనపల్లి కోర్టు హాజరు పరిచినట్లు అచ్చంపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకట ప్రసాద్ గురువారం తెలిపారు. ఆగస్టు 20న దేవాలయంలో దొంగతనం జరిగిందని, హుండీ కనపడటం లేదని ఈవో ఫిర్యాదు చేశారన్నారు. ఈ క్రమంలో వివిధ కోణాలలో విచారణ జరిపి దొంగతనానికి పాల్పడిన ఆరుగురు పై కేసు నమోదు చేసినట్లు వివరించారు ఎన్‌టిఆర్ జిల్లా పెనుగంచిప్రోలు గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ ఎల్లబోయిన గోపి మరో ఐదుగురితో కలిసి దొంగతనానికి పాల్పడ్డాడని, మటన్ షాపులో పనిచేస్తున్న అద్దంకి గురవయ్య, అద్దంకి శివ పెనుగంచిప్రోలు మండలం అంగలకుదురు గ్రామానికి చెందిన ముంగి రాములు, ముంగి కృష్ణ, పెనుగంచిప్రోలు మండలం కొల్లవాగు గ్రామానికి చెందిన శీలం వంశీ వీరందరూ కలసి దొంగతనం చేశారన్నారు. వీరివద్ద నుండి లక్ష1.70 వేల రూపాయల నగదును, కేజీ1.300 గ్రాముల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు ముద్దాలపై కేసు నమోదు చేసి సత్తనపల్లి కోర్టులో హాజరు పరిచి రిమాండ్ కు పంపినట్లు ఆయన వివరించారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీ చేస్తున్న అధికారులు

## ఎరువులు పక్కదారి పట్టడం లేదు : ఎడిఎ

**ప్రజాశక్తి - వినుకొండ**

పట్టణంలోని పురుగుమందుల షాపుల్లో ఎడిఎ బి.రవికుమార్ ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ అధికారులు గురువారం తనిఖీలు చేశారు. ఎరువులు పక్కదారి పడుతున్నాయనే సమాచారం మేరకు తనిఖీలు చేసినట్లు ఎడిఎ చెప్పారు. వినుకొండలో పిఎసిఎస్, డీసీఎంసీ ద్వారా సరఫరా చేసిన ఎరువులు పక్కదారి పట్టడం లేదని తనిఖీల్లో నిర్ధారణ అయినట్లు తెలిపారు. ఎరువులు, పురుగుమందులు, అధిక ధరలకు విక్రయాలు, అనుమతులు లేని గోడౌన్లపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఖరీఫ్ సీజన్లో రెండుసార్లు, రబీ సీజన్లో ఒకసారి ప్రత్యేక తనిఖీలు చేస్తున్నామన్నారు. ఈ ఏడాది ధ్రువపత్రాలు లేని ఎరువులు పురుగు మందులను గుర్తించి ఇటీవల రూ.1.20 కోట్ల సరుకును సీజ్ చేశామన్నారు. ఎమ్మార్పీ ధరల కంటే ఎరువులను అధిక ధనులకు విక్రయిస్తున్న ఇద్దరు డీలర్లను ఇటీవల గుర్తించి రూ.7.80 లక్షల స్టాకును నిలిపివేసి 6ఎ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డిఇఓ చంద్రకళ

## బడి బయట పిల్లల్ని గుర్తించండి : డిఇఒ

**ప్రజాశక్తి-పల్నాడు జిల్లా**

బడి బయట పిల్లలను గుర్తించి వారు పాఠశాలలకు వచ్చేలా ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు పల్నాడు జిల్లా విద్యా శాఖాధికారి ఎల్.చంద్రకళ సూచించారు. రొంపిచర్ల మండలం మాచవరం ఎంపియుపి పాఠశాల, వి.రెడ్డిపాలెం జెడ్పి పాఠశాలలను ఎంఇఒ బ్రహ్మేశ్వరరావుతోకలిసి డిఇఒ గురువారం తనిఖీ చేశారు. విద్యార్థులు హాజరు పట్టికను, ఉపాధ్యాయులు బోధనా తీరును పరిశీలించారు. వెనుక బడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, సిలబస్‌ను సకాలంలో పూర్తి చేయలని చెప్పారు. మధ్యాహ్న భోజన నిర్వహణలో మెనూను తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ అంకిత భావంతో పనిచేయాలన్నారు.

## గతేడాదికంటే పెరిగిన ఓట్ల నమోదు

**ప్రజాశక్తి-చిలకలూరిపేట**

ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టబద్రుల నియోజకవర్గ శాసనమండలి ఎన్నికలకు నాదెండ్ల మండల పరిధిలో 1385 దరఖాస్తులు వచ్చినట్లు తహాశీల్దార్ ఎవి రమణ గురువారం తెలిపారు. ఇందులో ఆన్‌లైన్ ద్వారా 1316, ఆఫ్‌లైన్ ద్వారా 1269 దరఖాస్తులు అందాయన్నారు. యడ్లపాడు మండలంలో 1269 ఓట్లు నమోదవగా ఇందులో ఆఫ్‌లైన్ ద్వారా 247, ఆన్‌లైన్ ద్వారా 1915 దరఖాస్తులు వచ్చాయన్నారు. చిలకలూరిపేటలో మొత్తం 5537 దరఖాస్తులు రాగా వీటిల్లో ఆన్‌లైన్ 616, ఆఫ్‌లైన్ 240 దరఖాస్తులు ఉన్నాయని తెలిపారు. గతేడాదికంటే ఈ ఏడాది అధికంగా దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.

# సమస్యలపై నేటి నుండి సిపిఎం ప్రజాపోరు

కరపత్రం ఆవిష్కరిస్తున్న గుంటూరు విజయకుమార్ తదితరులు

**ప్రజాశక్తి-సత్తెనపల్లి**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై శుక్రవారం నుండి సిపిఎం నిర్వహించే ప్రజాపోరు ప్రచార యాత్రను, ఈనెల 14న తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలను జయప్రదం చేయాలని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక పుతుంబాక భవన్లో ఎం.జ్యోతి అధ్యక్షతన గురువారం జరిగిన సిపిఎం పట్టణ కమిటీ సమావేశంలో విజయ్‌కుమార్ మాట్లాడారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగి పేద, మధ్యతరగతి ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పంటలకు మద్దతు ధరలు దక్కక రైతులు, కౌలురైతులు అప్పుల పాలవుతున్నారని చెప్పారు. నిరుద్యోగం నానాటికీ పెరుగుతోందన్నారు. ఈ సమస్యలను విస్మరించిన కేంద్ర ప్రభుత్వం విద్వేష పూర్తి రాజకీయాలు చేస్తోందని, దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెడుతోందని విమర్శించారు. మరోవైపు రాజ్యాంగ విరుద్ధంగా జెమిలి ఎన్నికలకు వెళుతోందని మండిపడ్డారు. మహిళలపై దాడులను అరికట్టాలని, ప్రభుత్వం పరిశ్రమలను పరిరక్షించుకోవాలని అన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఉద్యమిస్తోందన్నారు. సిపిఎం పట్టణ కార్యదర్శి డి.విముల మాట్లాడుతూ పట్టణంలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని, ఎక్కడ చెత్తకుప్పలు ఒక్కడే ఉండి దుర్గంధం వెదజల్లుతోందని అన్నారు. మురుగు కాల్వలు శుభ్రం చేయకపోవడంతో దోమలు వృద్ధి చెంది ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఏర్పడిందన్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి ఈ సమస్యలను పరిష్కరించాలన్నారు. అనంతరం ప్రజాపోరు ప్రచార యాత్ర కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో ఎం.హరిపోతురాజు, కె.శివదుర్గారావు, ఎ.వీరబ్రహ్మం, జె.రాజకుమార్, పి.ప్రభాకర్, షేక్ మస్తాన్‌వలి, పి.రామారావు, షేక్ సైదులు, ఎం.కార్తీక్ పాల్గొన్నారు.

**ప్రజాశక్తి-చిలకలూరిపేట**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై శుక్రవారం 15వ తేదీ వరకు సిపిఎం నిర్వహించే ప్రజాపోరు-ప్రచార యాత్రను జయప్రదం చేయాలని, 14వ తేదీన తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నాకు తరలిరావాలని నాయకులు కోరారు. ఈ మేరకు స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. సిపిఎం పట్టణ కన్వీనర్ పి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి

ప్రభుత్వం ఎన్నికల హామీలను విస్మరించిందని, పైగా విద్యుత్ భారాలు మోపుతోందని విమర్శించారు. పెరిగిన ధరలతో పేదలు అర్ధాకలితో బతుకుతున్నారని, ధరల నియంత్రణను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఉచిత ఇసుక భవన నిర్మాణ కార్మికులు ఉపాధి కోల్పోయారని చెప్పారు. ఈ నేపథ్యంలో నిర్వహించే ఆందోళనల్లో ప్రజలు కలిసి రావాలని కోరారు. నాయకులు ఎస్.లూథర్, బి.కోటానాయక్, పి.భారతి, జె.రాజశేఖర్, పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

**ప్రజాశక్తి-పిడుగురాళ్ల**

సిపిఎం ఆద్వర్యంలో శుక్రవారం నుండి 15వ తేదీ వరకు జరిగే ప్రజాపోరు, ప్రచార యాత్రను జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. సిపిఎం మండల కన్వీనర్ టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ పెట్రోల్, ఇతర నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ప్రజల జీవనం అస్తవ్యస్తమవుతోందని అన్నారు. మరోవైపు విద్యుత్ భారాలకు రాష్ట్రప్రభుత్వం సిద్ధమైందని విమర్శించారు. స్థానికంగా టిట్కో గృహాలు నిర్మించి వెంటనే లబ్ధిదారులకు ఇవ్వాలని, అసంపూర్తిగా ఉన్న జగనన్ కాలనీల నిర్మాణం పూర్తి చేయాలని, రేషన్ ద్వారా 19 రకాల నిత్యావసర వస్తువులను సరఫరా చేయాలని, విద్యుత్ ఛార్జీలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ అంశాలపై జరిగే ఆందోళనల్లో ప్రజలంతా పాల్గొనాలని, 14వ తేదీన మండల కేంద్రాల్లో ధర్నాలను జయప్రదం చేయాలని కోరారు. కరపత్రాలు ఆవిష్కరించిన వారిలో ఎస్.వెంకటకృష్ణ, టి.వెంకయ్య, అంకారావు, వెంకటేశ్వర్లు, సైదులు, లక్ష్మయ్య, నాగేశ్వరరావు ఉన్నారు.

## సంక్షోభంలో పత్తిరైతులు : ఎమ్మెల్యే పుల్లారావు

### తిమ్మాపురంలో పత్తికొనుగోలు కేంద్రం ప్రారంభం

**ప్రజాశక్తి - యడ్లపాడు**

రాష్ట్రంలో తొలి పత్తి కొనుగోలు కేంద్రాలు రెండింటినీ చికలూరిపేట నియోజకవర్గంలో ఏర్పాటు చేశామని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. తిమ్మాపురం గ్రామ పరిధిలో ఉన్న శ్రీనివాస కాటన్ మిల్స్ వద్ద సిసిఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే గురువారం ప్రారంభించి మాట్లాడారు. తెగుళ్ల వల్ల దిగుబడి గణనీయంగా తగ్గి 6 క్వింటాళ్లయినా వచ్చే పరిస్థితి లేకుండా పోయిందని, 10 క్వింటాళ్లయినా వచ్చి ఉంటే బాగుండేదని అన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దని, కొనుగోలు కేంద్రాల్లోనే పంటను అమ్ముకోవాలని రైతులకు సూచించారు. పత్తి రైతులు

సంక్షోభంలో ఉన్నారని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేసేలా కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాని తెలిపారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి టి.రాజారమేష్, ఆర్‌డి శ్రీనివాస్, సీనియర్ కర్షియల్ అధికారి రమేష్ పాల్గొన్నారు.

## క్షతగాత్రుణ్ణి ఆస్పత్రిలో చేర్చిన ఎమ్మెల్యే

**ప్రజాశక్తి - వినుకొండ :** రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రుణ్ణి ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తన వాహనంలో ఆస్పత్రికి తరలించారు. మండలంలోని విఠంరాజుపల్లి వద్ద గురువారం రోడ్డు ప్రమాదం జరిగి గాదే మహానందరెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు.

రోడ్డుపై ఉన్న అతన్ని గుంటూరు నుండి కారులో వినుకొండకు వస్తున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు చూసి తన వాహనాన్ని ఆపించారు. క్షతగాత్రుణ్ణి వినుకొండ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్‌కు ఫోన్ చేసి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

## ఈశ్వర్ ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉద్యోగాలు

**ప్రజాశక్తి-పల్నాడు జిల్లా**

నరసరావుపేట మండలంలోని కేశానుపల్లి గ్రామ పరిధిలో గల తమ కళాశాలలో బహుళ జాతి కంపెనీ సదర్లాండ్ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 21 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని ఈశ్వర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ చైర్మన్ షేక్ మీరావలి గురువారం తెలిపారు. కంపెనీ మేనేజర్ - హెచ్ఆర్ ప్రతినిధి సోనియా థామస్ కంపెనీ విధివిధానాలు, కార్యకలాపాల నిర్వహణపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించిన అనంతరం ప్రాంగణ ఎంపికలను చేపట్టారన్నారు. ఎంపికల్లో 180 మంది పాల్గొనగా 21 మంది ఎంపికయ్యారని, వీరు 2024-25 విద్యా సంవత్సరం పూర్తి కాగానే ఉద్యోగాల్లో చేరతారని చెప్పారు. శిక్షణ కాలంలో వార్షిక వేతనం రూ.2.70 ఉంటుందన్నారు. 100 శాతం ఉపాధి అవకాశాల కల్పనే

ధ్యేయంగా అనుభవం కలిగిన అధ్యాపకులచే నాణ్యమైన బోధన సాగిస్తున్నామన్నారు. కళాశాల సెక్రటరీ - కరస్పాండెంట్ షేక్.కరీమ్ మొహిద్దీన్, మేనేజింగ్ డైరెక్టర్ షేక్ మస్తాన్‌షరీఫ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ షేక్ నజీమ మాట్లాడుతూ బహుళజాతి కంపెనీలు తమ కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 95 శాతం మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధిస్తున్నారని చెప్పారు. ఇంజినీరింగ్ విద్యలో మొదటి ఏడాది నుండి ఉపాధి అవకాశాలకు సంబంధించిన అంశాలపై నిర్వహిస్తున్న ప్రత్యేక శిక్షణతో విద్యార్థులు ఉద్యోగాలు సాధిస్తున్నారని అన్నారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.నాగమల్లేశ్వరరావు, టిపిఒ డాక్టర్ షేక్ ముజీర్, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

## వీల్ చైర్లు, ట్రై సైకిళ్ల కోసం సంప్రదించండి

**ప్రజాశక్తి- వెల్దుర్తి**

మాచర్ల నియోజకవర్గంలో వీల్ చైర్లు ట్రై సైకిల్స్ కావాల్సిన వికలాంగులు మాచర్ల పట్టణంలోని సొసైటి కాలనీలో వున్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి కార్యాలయాన్ని సంప్రదించాలని ఎమ్మెల్యే కార్యాలయం గురువారం ఒక ప్రకటన జారీ చేసింది. ఆధార్ కార్డు, రేషన్ కార్డు, సదరం సర్టిఫికెట్ ఫొటోస్టాట్ కాపీలు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, వైకల్యాన్ని నిర్ధారించే ఫొటోలు, ఫోన్ నెంబర్‌తో కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించింది.

# ప్రజా సమస్యలపై 11న కలెక్టరేట్ వద్ద ధర్నా : సిపిఎం

ప్రజాశక్తి-గుంటూరు

ప్రజా సమస్యల పరిష్కారానికి రాష్ట్రవ్యాప్త 'ప్రజా పోరు' ప్రచార కార్యక్రమంలో భాగంగా సిపిఎం ఆధ్వర్యంలో నవంబర్ 11న గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సిపియం నగర కార్యదర్శి కె.నళినీకాంత్ పిలుపు నిచ్చారు. గురువారం బ్రాడీపేటలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ధర్నా కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో 3వసారి అధికారంలోకి బిజెపి ప్రభుత్వం నిత్యావసర ధరలు, పెట్రోలు, డీజిల్ ధరలు అరికట్టడంలో, నిరుద్యోగం తగ్గించటంలో తీవ్రంగా వైఫల్యం చెందిందన్నారు. దేశంలో మహిళలు, బాలికలపై దాడులు పెరిగాయాన్నరు. మహిళలపట్ల చిన్న చూపు ధోరణి ఉన్న ప్రభుత్వాలు అధికారంలో ఉండటం, పోర్న్ వీడియోస్‌ను, మద్యాన్ని అరికట్టలేకపోవటమే దీనికి కారణం అన్నారు. బిజెపి ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతుందన్నారు. ఒకే దేశం, ఒకే ఎన్నిక పేరుతో రాష్ట్రాల హక్కులను హరించే విధంగా జమిలి ఎన్నికలు తెచ్చేందుకు ప్రయత్నిస్తుందన్నారు. ఈ విధానానికి టిడిపి వంతపాడటం పడటం రాష్ట్ర ప్రజలకు అవమానకరం అన్నారు. రాష్ట్రంలో టిడిపి సూపర్ సిక్స్ హామీలు పేరుతో అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు అవుతున్నా హామీలు అమలుకు నోచుకోలేదన్నారు. ఉచిత ఇసుక పేరుకే అని, ట్రాక్టర్ ఇసుక ధర గతం కంటే పెరిగిందని, ఇసుక అందుబాటులో లేదన్నారు. ఇసుక లేక కార్మికులకు ఉపాధి తగ్గిపోయిందన్నారు. ఎన్నికలకు ముందు విద్యుత్తు సర్దుబాటు చార్జీలు, ట్రూఅప్ ఛార్జీలు పెంచబోమని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.6,072 కోట్లు విద్యుత్ భారం మోపిందన్నారు. మరో రూ.11వేల కోట్లు భారం వేయటానికి సిద్ధమైందన్నారు. ఆయా సమస్యలపై అన్ని ప్రాంతాల్లో ప్రజాపోరు ప్రచార యాత్ర నిర్వహించి, చివరిగా 11న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేయనున్నట్లు చెప్పారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసన తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నగర కమిటీ సభ్యులు బి.సత్యనారాయణ, షేక్ ఖాశిం షహీద్ తదితరులు పాల్గొన్నారు.

**నిత్యావసర వస్తువుల ధరలు నియంత్రించాలి**

కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరశిస్తూ ఈనెల 11న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సిపియం నగర కార్యదర్శివర్గ సభ్యులు కె.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. సిపియం 'ప్రజాపోరు' ప్రచార యాత్రలో భాగంగా గురువారం వెంకటాద్రిపేట, న్యూ గుంటూరు రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక హామీ నెరవేర్చలేదన్నారు. గతం కంటే ఇసుక ధరలు పెరిగాయన్నారు. నెహ్రూ నగర్ శాఖ కార్యదర్శి టి.రాధా మాట్లాడుతూ11న ధర్నాలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై తమ నిరసన తెలపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సుబ్బరాయుడు, కిన్నెర, నాగేశ్వరి, సునంద, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరిస్తున్న నళినీకాంత్ తదితర నాయకులు

ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న నగర కమిషనర్ పులి శ్రీనివాసులు

## రెండో గురువారం కార్మికుల గ్రీవెన్స్

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో పనిచేసే ప్రజారోగ్య, ఇంజినీరింగ్ కార్మికులు తమ సమస్యలపై ఫిర్యాదులు, అర్జీలు అందించేందుకు ప్రతినెల రెండో గురువారం మధ్యాహ్నం 3 నుండి 4 గంటల వరకు ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తామని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. గురువారం కమిషనర్ చాంబర్‌లో కార్మికుల సమస్యల పరిష్కారంపై లీడ్ బ్యాంక్ మేనేజర్, వివిస్పిఎన్ ఏజన్సీ, వివిధ కార్మిక సంఘాల నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో కార్మికులు ప్రధానంగా పిఎఫ్, ఈఎస్ఐ, రుణాలు, ఆప్కాస్ తదితర అంశాలపై ఎదురవుతున్న సమస్యలను తమ దష్టికి తెస్తున్నారన్నారు. సదరు సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటామన్నారు. వార్డు సచివాలయాల వారీగా ఎన్విరాన్‌మెంట్ కార్యదర్శులు తమ పరిధిలోని కార్మికులకు ఉన్న పిఎఫ్ సమస్యలపై రిపోర్ట్ ఇవ్వాలని ఆదేశించామని తెలిపారు. అనంతరం కార్మిక సంఘాల నాయకులు వివిధ సమస్యలపై అందించిన అర్జీలను తీసుకున్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ సిహెచ్.ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు సిహెచ్.శ్రీనివాసరావు, టి.వెంకట కష్ణయ్య, లీడ్ బ్యాంక్ మేనేజర్ మణి పాల్ రెడ్డి, వివిస్పిఎన్ ఏజన్సీ నుండి నాగేశ్వరరావు, వివిధ కార్మిక సంఘాల నుండి బి.ముత్యాలరావు, కె.మాల్యాద్రి, మధుబాబు, శంకర్రావు, రవి కుమార్, కమల్ తదితరులు పాల్గొన్నారు.

పాడైపోయిన మోటార్ పంప్ సెట్ లను పరిశీలిస్తున్న నాయకులు

## లంక పొలాల రైతులకు నష్టపరిహారమివ్వాలి

ప్రజాశక్తి - కొల్లిపర

వరదల కారణంగా లంక పొలాల్లో వ్యవసాయ పంపు సెట్లు పూర్తిగా దెబ్బతిన్నప్పటికీ ఇప్పటివరకు అధికారులు పట్టించుకోకపోవడం, నష్టపరిహారం ఇవ్వకపోవడం దుర్మార్గమని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి హరిబాబు ప్రభుత్వాన్ని విమర్శించారు. గురువారం కౌలు రైతు సంఘం నాయకులు రైతు సంఘం నాయకులు ఇటీవల వరదల కారణంగా కొల్లిపర మండలంలో దెబ్బతిన్న లంక గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ విజయవాడలో వరదల కారణంగా పాడైపోయిన స్కూటర్లకి ఆటోలకి, కార్లకి, ఇంట్లోని పరికరాలకు నష్టపరిహారం ఇచ్చిన ప్రభుత్వము లంక గ్రామాల్లోని వ్యవసాయ మోటర్లు ఆయిల్ ఇంజన్లకు నష్టపరిహారం ఇవ్వకపోవడం పోవడం సరైనది కాదని అంతేకాక విజయవాడలో ఇళ్లలోనికి వరద నీరు వస్తే రూ.పాతిక వేల నష్టపరిహారం ఇచ్చిన ప్రభుత్వం లంక గ్రామాల్లో నీరు వస్తే రూ.పదివేలతో సరిపెట్టడం సరికాదన్నారు. లంక సొసైటీ భూములు సాగు చేసే సాగుదారులకు నష్టపరిహారం ఒక్క రూపాయి ఇవ్వలేదని రైతు సంఘం నాయకులు వద్ద సొసైటీ సాగు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వారికి వెంటనే నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివ సాంబి రెడ్డి, సిఐటియు మండల కార్యదర్శి కోటా చంద్రశేఖర్ రైతులు పాల్గొన్నారు

## ఎరువుల కొరతను నియంత్రించాలని వినతి

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

కాకుమాను,పెదనందిపాడు.మండలాలలో ఎరువుల కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కొత్త వెంకటశివరావు అన్నారు. రబీ సీజన్లో రైతులు ఎరువుల కొరతతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, సొసైటీలలో స్టాకు లేదని, రైతులు ఇబ్బందులను కనిపెట్టిన ప్రైవేట్ వ్యాపారులు తమ వద్ద ఉన్న ఎరువులనుఅధిక ధరలకు విక్రయిస్తున్నారని తెలిపారు. రైతు సేవా కేంద్రాలలో ఎరువులు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. శనగ, మొక్కజొన్న విత్తనాలను 90 శాతం సబ్సిడీతో అందించాలని కోరారు. పెదనందిపాడు లోని నాగులపాడు మార్కెట్ యార్డులో పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. పెదనందిపాడు, ప్రత్తిపాడు, కాకుమాను, వట్టి చెరుకూరు మండలాలలో పత్తి సాగు పెరిగిన నేపథ్యంలో కొనుగోలు కేంద్రాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. పత్తి ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలు రూ.7,521 ఉండగా, రైతుల అవసరాలను కనిపెట్టిన ప్రైవేట్ వ్యాపారస్తులు రూ.5,000 లోపు కొంటున్నారని తెలిపారు. అనంతరం పెదనందిపాడు తహశీల్దార్ పి శంకర్ బాబు కు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ముద్దన వెంకటేశ్వర్లు, దొప్పలపూడి రమేష్ బాబు, నల్లమోతు రాజేంద్ర, పోపూరి సుధీర్, కన్నెగంటి చంద్రరావు, గొల్లపూడి సుబ్బారావు పాల్గొన్నారు.

## ఆక్రమణలను స్వచ్ఛదంగా తొలగించుకోవాలి : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో రోడ్లు, డ్రైన్ల మీద ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని, లేకుంటే జిఎంసి సిబ్బందే పూర్తి స్థాయిలో తొలగిస్తారని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. గురువారం కమిషనర్ టెలీకాన్ఫరెన్స్‌లో ఆక్రమణల తొలగింపుపై పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర పరిధిలో దశలవారీగా చేపట్టిన డ్రైన్లు, రోడ్ల ఆక్రమణల తొలగింపు ముమ్మరంగా జరుగుతున్నాయని, ఆక్రమణదారులు స్వచ్ఛందంగా తొలగించుకోవాలన్నారు. అమరావతి రోడ్‌లో, గోరంట్ల మెయిన్‌రోడ్, జిటి రోడ్, నల్లపాడు రోడ్లలో ఆక్రమణలు తొలగిస్తున్నామన్నారు. నగరంలో ఒకసారి ఆక్రమణలు తొలగించిన ప్రాంతాల్లో తిరిగి ఆక్రమణలు జరగకుండా ప్లానింగ్ కార్యదర్శులు పర్యవేక్షణ చేయాలన్నారు. డ్రైన్‌కి ముందర ఏ విధమైన ఆక్రమణలుఉండడానికి వీలు లేదని స్పష్టం చేశారు. అలాగే ఆక్రమణల తొలగింపు జరిగిన డ్రైన్లలో పూడిక తీత పనులు చేపట్టాలని, తీసిన పూడికను వెంటనే తరలించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

## డ్రెయినేజీ సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తాం : ఎమ్మెల్యే నసీర్

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు తూర్పు నియోజకవర్గంలో డ్రైనేజి సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. బుధవారం నియోజకవర్గంలో 1, 54, 56, వార్డులలో అధికారులతో కలిసి పర్యటించి డ్రెయినేజీ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు అధికారులను ప్రతిపాదనలు తయారు చేయాలని ఆదేశించారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తూర్పు నియోజకవర్గంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యంతో డ్రైనేజ్ సమస్యలు పేరుకు పోయాయని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఐదు నెలల్లోనే ప్రజా సమస్యలపై దృష్టి పెట్టామని అన్నారు. వర్షాకాలంలో వర్షపు నీరు ఓవర్ ఫ్లో అయ్యి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆయా సమస్యలు పరిష్కరించేందుకు 15వ ఆర్థిక సంఘం ద్వారా రూ.32.2 కోట్లు కేటాయించి ప్రధాన సిసి డ్రైనేజీలు 20 రోజుల్లో నిర్మాణ పనులు ప్రారంభిం చబోతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వేల్పూరి కిరణ్ అన్వర్, జాబి, శైలజ, దిలీప్, శంకర్, వాణి, తదితర అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సూర్యకుమారి

## బాలికల సాధికారతకు కిశోరి వికాసం

ప్రజాశక్తి-గుంటూరు

కౌమార దశలోని బాలికల సాధికారత కోసం కిశోరి వికాసం ద్వారా గ్రామ స్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ సెక్రెటరీ ఎ.సూర్యకుమారి అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన కిషోరి వికాసం పున:ప్రారంభ కార్యక్రమంలో సూర్యకుమారి పాల్గొని ప్రసంగించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ ఎపిలో దురదృష్టవశాత్తూ బాల్య వివాహాలు అధికంగా ఉన్నాయన్నారు. పశ్చిమ గోదావరి మినహా అన్ని జిల్లాల్లో జరుగుతున్నాయని చెప్పారు. కిశోరి వికాసం కార్యక్రమం ద్వారా బాల్య వివాహాల నిర్మూలతోపాటు, వారి అభివృద్ధికి అన్ని రకాలుగా చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. చదువు మానేసిన వారిని చదువుకునే ఆసక్తి ఉంటే చదువుకునేందుకు సహకరించటం, లేదంటే ఒకేషనల్ ట్రైనింగ్ ఇచ్చి ఉపాధి చూపించటం తదితర కార్యక్రమాలు చేపట్టటం కోసం రాష్ట్రవ్యాప్తంగా ఏడు శాఖల సమన్వయంతో గ్రామ స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించబోతున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా రాష్ట్ర స్థాయిలో శిక్షకులకు శిక్షణ కార్యక్రమం గుంటూరులో నిర్వహిస్తున్నామని, వీరు మండల స్థాయిలో, అక్కడి నుండి గ్రామ స్థాయిలో ఏర్పాటు చేసిన కమిటీలకు శిక్షణ ఇస్తారన్నారు. శిక్షణ పొందిన వారు ప్రతి ఇంటికీ వెళ్లి బాల్య వివాహాలు, బాలికల అభివృద్ధిపై అవగాహన కల్పిస్తారన్నారు. కౌమార దశలో కలిగే ఆకర్షణలు, బహిష్టు సమయంలో వ్యక్తిగత పరిశుభ్రత, పౌష్టికాహారం, తదితర అంశాలపైనా అవగాహన కల్పిస్తారన్నారు. కార్యక్రమంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ యం.వేణుగోపాల్‌రెడ్డి, యునిసెఫ్ నుండి డాక్టర్ మురళీకృష్ణ, ఎయిమ్స్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్తి గుప్తా, సైకాలజిస్ట్ ఎస్.సుధీర్ తదితరులు ప్రసంగించారు.

## పెరిగిన ధరలను తగ్గించండి : సిపిఎం

**14న ప్రజాపోరు ధర్నా జయప్రదం చేయండి**

ప్రజాశక్తి - తాడేపల్లి

ఖాళీగా ఉన్న ఉద్యోగ పోస్టులను భర్తీ చేయాలని సిపిఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలు నిరసిస్తూ సిపిఎం నిర్వహిస్తున్న ప్రజా పోరు కార్యక్రమంలో భాగంగా గురువారం ఉండవల్లి హెడ్ స్లూయిస్ వద్దగల పుష్కర కాలనీలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయకుండా సంపద ఎలా సృష్టిస్తారని ప్రశ్నించారు. ప్రతి ఏటా దేశంలో నిరుద్యోగం పెరిగిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎంబీఏ, ఎంసీఏ చేసిన విద్యార్థులు ఉద్యోగ అవకాశాలు లేక అతి తక్కువ వేతనాలకు ప్రైవేటు ఉద్యోగాలు చేస్తున్న సంగతిని ప్రభుత్వాలు గుర్తించాలని కోరారు. నిరుద్యోగులకు భృతి ఇస్తామన్న పాలక పార్టీలు ఆ దిశగా ఆలోచించడం లేదని విమర్శించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా నిత్యవసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని చెప్పారు. మధ్య తరగతి, సామాన్య ప్రజలు కొనుగోలు చేయలేని విధంగా ధరల పెరుగుదల ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీని కి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలే బాధ్యత వహించాలని కోరారు. తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచమని ఇప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ఆనాడు చెప్పిన మాట తప్పి ఈనాడు 18 వేల కోట్ల రూపాయలు చార్జీలు పేరుతో ప్రజలపై భారం మోపారు అనివిమర్శించారు. పెంచిన కరెంటు చార్జీలు తగ్గించకపోతే ప్రజాగ్రహం తప్పదని హెచ్చరించారు. ఈనెల 14వ తేదీ తాడేపల్లి ఎంఆర్ఓ కార్యాలయం ముందు జరిగే ప్రజా పోరు కార్యక్రమానికి తరలిరావాలని స్థానికులను కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కే ఎల్ రావు కాలనీ శాఖ కార్యదర్శి కట్ట మేరీ. భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విజేతలతో కళాశాల చైర్మన్, స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రతినిధులు

## సౌత్‌వెస్ట్ విశ్వవిద్యాలయ వెయిట్‌లిఫ్టింగ్ పోటీలకు ధనలక్ష్మి కళాశాల విద్యార్థిని

ప్రజాశక్తి-ఈపూరు

ధనలక్ష్మి వ్యాయామ కళాశాల ఆధ్వర్యంలో ఈనెల ఆరవ తేదీన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగిన అంతర్ కళాశాలల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో విద్యార్థిని ఎం.అనూష ప్రతిభ కనబరిచారు. ఈనెల 26వ తేది నుండి డిసెంబరు 3 వరకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగే సౌత్ వెస్ట్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో 49 కిలోల విభాగంలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం తరపున ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చుండు వెంకటరావు తెలిపారు. వర్సిటీలో జరిగిన పోటీల్లో మహిళల 49 కిలోల కేటగిరీలో ఎం.అనూష (గోల్డ్ మెడల్), 59 కిలోల విభాగంలో ఎం.రాజేశ్వరి (సిల్వర్ మెడల్), 59 కిలోల కేటగిరీలో కె.వెంకటేశ్వరి (సిల్వర్ మెడల్) సాధించారని, పురుషుల 61 కిలోల కేటగిరిలో ఆర్.హనుమాన్ నాయక్ (సిల్వర్ మెడల్) సాధించినట్లు ప్రిన్సిపాల్ వివరించారు. వీరిని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మేదరమెట్ల రామశేషగిరిరావు, అధ్యాపకులు ఆర్.బలరాం నాయక్, సిహెచ్.అరవింద్, ఎం.దాసు, కె.వంశీ చైతన్య అభినందించారు.

## 104 సిబ్బంది సమస్యలను పరిష్కరించాలి

**ప్రజాశక్తి- మాచర్ల రూరల్ :** తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 104 సిబ్బంది స్థానిక తహశీల్దార్ వాణికి గురువారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు సుభాని మాట్లాడుతూ వేతన బాకాయిలు వెంటనే చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కొత్తగా విధుల్లో చేరిన డ్రైవర్లకు డి.ఈ.ఓ కు జి.ఓ 7 ద్వారా వేతనాలు ఇవ్వాలని, అరబిందో యాజమాన్యం అక్రమంగా వసూలు చేసిన పిఎఫ్ సొమ్మును తిరిగి ఇప్పించాలని కోరారు. ఉద్యోగులకు బీమా సౌకర్యం కల్పించాలని, ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించి ఉద్యోగులకు న్యాయం చెయ్యాలని డిమాండ్ చేశారు.

## పరిసరాల పరిశుభ్రతకు సహకరించాలి

**ప్రజాశక్తి- మాచర్ల రూరల్ :** పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరు సహకరించాలని మున్సిపల్ ఛైర్మన్ పోలూరి నరసింహారావు కోరారు. గురువారం పట్టణంలోని కొమ్మళ్ల కాల్వలో పూడికతీత పనులను ఆయన పరిశీలించారు. అంటు వ్యాధులు ప్రభలకుండా పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచటానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. సుమారు రూ.15 లక్షలతో పట్టణంలోని ప్రధాన మురుగు కాల్వలు, వార్డుల్లోని సైడు కాల్వల్లో మురుగుతీత పనులు చేస్తున్నట్లు తెలిపారు. వ్యర్థాలను రోడ్లపై, మరుగు కాల్వల్లో వేయద్దని, పరిసరాలను పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు.

# నైపుణ్య గణనపై సచివాలయ సిబ్బందికి శిక్షణ

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న నైపుణ్య గణన సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని సచివాలయ సిబ్బందిని ఎంపిడిఒ బి.శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన శిక్షణను ఎంపిడిఒ ప్రారంభించగా నైపుణ్య శిక్షణాధికారి ఈ.రామకృష్ణారెడ్డి పలు అంశాలను వివరించారు. ఫోన్లో మొబైల్ అప్లికేషన్‌పై అవగాహన కల్పించారు. ఇందులో 15 నుండి

సత్తెనపల్లిలో శిక్షణ ఇస్తున్న అధికారులు

59 మధ్య వయసు గలవారికి నైపుణ్య గణన సర్వే నిర్వహించి వారి అకాంక్ష నెరవేర్చే విధంగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈపిఓఆర్డీ శ్రీనివాసరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**ప్రజాశక్తి- మాచర్ల**

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నైపుణ్య గణన సర్వే ప్రారంభమవుతున్న తరుణంలో ఎంపిడిఒ ఆర్.ఫణి కుమార్ నాయక్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల పరిధిలోని సచివాలయ సిబ్బందికి శిక్షణా తరగతులు నిర్వహించారు. స్కిల్ సెన్సస్ కో-ఆర్డినేటర్ కిరణ్ నాయక్ శిక్షణిచ్చారు. ఈవోపిఆర్డి కోటేశ్వరరావు, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గతం కంటే అధికంగా ఇసుక ధరలు : సిపిఎం

ప్రజాశక్తి - దాచేపల్లి

ఉచిత ఇసుక సరఫరాకు ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకోవాలని, అధికార పార్టీ నాయకుల చేతుల్లో ఇసుక దందాను అరికట్టాలని సిపిఎం మండల కార్యదర్శి ఆంజనేయరాజు డిమాండ్ చేశారు. ప్రస్తుతం టన్నుకు రూ.1500-2000 వరకు వసూలు చేస్తున్నారని, ట్రాక్టర్ ఇసుక రూ.7500 ఉంటోందని చెప్పారు. ఈ ధరలతో సామాన్యులకు ఇళ్ల నిర్మాణం సాధ్యం కావడం లేదని, భవన నిర్మాణ కార్మికులకు పనులు కూడా దొరకడం లేదని చెప్పారు. గత ప్రభుత్వంలో ఇసుక ఉచితం కాకున్నా రూ.5 వేలకు దొరికిందని ఇప్పుడు అదే ఇసుక రూ.7500 అయ్యిందని చెప్పారు. మండలంలో అధికార పార్టీ అండతో కొందరు సిండికేట్‌గా మారి ఇసుక ధరలు అమాంతంగా పెంచారని, దగ్గరలో ఉన్న ఇసుక రీచ్ నుండి 30 టన్నులు లారీ ఇసుక తెచ్చుకోవడానికి రవాణా ఛార్జి రూ.12 వేలుగా ఉంటోందని ఇంకో రూ.3 వేలు అదనపు ఖర్చులనుకున్నా టన్ను ఇసుక రూ.500 రావాలని, ట్రాక్టర్ ఇసుక ఖరీదు రూ.3 వేలకు మించకూడదని గుర్తు చేశారు. ఉచిత ఇసుక ఇస్తున్నాం.. అక్రమాలకు పాల్పడితే తాట తీస్తాం.. అని సిఎం ప్రకటిస్తున్నా క్షేత్రస్థాయి పరిస్థితుల్లో మార్పు మాత్రం లేదన్నారు. దీనిపై అధికారులు వెంటనే స్పందించాలని, సరసమైన ధరలకు ఇసుక అందేలా చూడాలని కోరారు. పరిస్థితులో మార్పు లేకుంటే తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

# వాలీబాల్‌లో చెన్నుపాటి ఇండో అమెరికన్ ఫార్మసీ విజయం

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

నరసరావుపేట మండలంలోని పెట్లూరువారిపాలెం గ్రామ పరిధిలో గల ఎఎం రెడ్డి స్మారక ఫార్మసీ కళాశాలలో బుధవారం జరిగిన ఉమ్మడి గుంటూరు జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో తమ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటి ప్రథమ స్థానంలో నిలిచారని చెన్నుపాటి ఇండో అమెరికన్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చెన్నుపాటి సత్యనారాయణ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా జొన్నగడ్డ గ్రామ పరిధిలో గల కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో సత్యనారాయణ మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 15 ఫార్మసీ కళాశాలల విద్యార్థులు పాల్గొనగా ఫైనల్లో గుంటూరు జిల్లా నల్లపాడు విక్టోరియా ఫార్మసీ కళాశాల జట్టుపై జరిగిన హోరాహోరీ మ్యాచ్‌లో తమ విద్యార్థులు విజయం సాధించి ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. తమ కళాశాలలో విద్యతో పాటు ఆటలకు ప్రాధాన్యం ఇస్తున్నామని, క్రీడలు మానసిక

వాలీబాల్ జట్టుతో కాలేజీ నిర్వాహకులు

పునరుత్తేజానికి, శరీర దారుఢ్యానికి దోహదం చేస్తాయని అన్నారు. తమ విద్యార్థులను అభినందిస్తూ ఎఎం.రెడ్డి స్మారక కళాశాలల సెక్రటరీ - కరస్పాండెంట్ అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి రూ.5 వేలు పురస్కారాన్ని అందజేశారన్నారు. విజేతలను ప్రిన్సిపాల్ డాక్టర్ చెన్నుపాటి వెంకట సురేష్, పరిపాలన అధికారి రమేష్, పీడీ ప్రమోద్ అభినందించారు.

# పర్యావరణ పరిరక్షణ కోసం అందరూ మొక్కలు నాటాలి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని, ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటి సంరక్షించాలని ఎఎం రెడ్డి విద్యాసంస్థల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి అన్నారు. నరసరావుపేట మండలంలోని ఎఎం రెడ్డి స్మారక ఫార్మసీ కళాశాలలో గురువారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అట్లూరి శాంతి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటి పెంచాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. అటవీ శాతం తగ్గిపోవడంతో పర్యావరణంలో పెను మార్పులు చోటుచేసుకుంటున్నాయని, భవిష్యత్ తరాలను దృష్టిలో పెట్టుకుని వృక్ష సంపదను పెంచేందుకు మొక్కలను విరివిగా నాటాలని కోరారు. పర్యావరణ పరిరక్షణలో పచ్చని చెట్లు ప్రధాన భూమిక పోషిస్తాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.భార్గవ్ భూషణ్ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో 200కు పైగా మొక్కలను కళాశాలలో ప్రాంగణంలో, పరిసర ప్రాంతాల్లో నాటామని చెప్పారు. కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్ కో-ఆర్డినేటర్ అశోక్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పండ్ల తోటలను పరిశీలించిన పీడీ

**ప్రజాశక్తి - పెదకూరపాడు :** మండలంలోని పరస గ్రామంలో పండ్ల తోటలను డ్వామ పీడీ లింగమూర్తి గురువారం పరిశీలించారు. అనంతరం పెదకూరపాడులోని సిమెంటు రోడ్లను పరిశీలించారు. ఎపిఒ కె.కోటేశ్వరరావు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

## లాయర్ పోతల రవికుమార్ మృతి

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

పట్టణంలోని వడ్డవల్లికి చెందిన న్యాయవాది పోతల రవికుమార్ గుండెపోటుతో బుధవారం రాత్రి మృతి చెందారు. భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. 17 ఏళ్లగా న్యాయవాదిగా వృత్తిలో ఉన్న ఆయన గుండెపోటుకు గురవటంతో కుటుంబీకులు హుటాహుటిన నర్సరావుపేట ప్రైవేట్ వైద్యాశాలకు తరలించారు. చికిత్స పొందుతున్న ఆయన బుధవారం రాత్రి మరణించారు. భౌతికకాయాన్ని బార్ అసోసియేషన్ న్యాయవాదులు సందర్శించి నివాళులర్పించారు. అనంతరం అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

## జీవో 58 అమలు కోసం వినతి

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

జీవో 58ను అమలు చేయాలని ప్రగతి మాదిగదాసు సంక్షేమ సేవ సంఘం ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షులు అంకాళ్ల నాగరాజు, దళిత బహుజన రిసోర్స్ సెంటర్ పల్నాడు జిల్లా కో-ఆర్డినేటట్ మల్లెల చిన్నప్ప కోరారు. ఈ మేరకు పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో జెసి సూరజ్ గనోరేను కలిసి వినతిపత్రం ఇచ్చారు. మాదిగదాసుకు కుల ధ్రువీకరణ పత్రాన్ని ఆర్‌డిఒ కార్యాలయం నుండి పొందాల్సి రావడం వల్ల జాప్యమవుతోందని జీవో 58 ప్రకారం తహసీల్దార్ కార్యాలయం నుండి మంజూరు చేసేలా చూడాలని కోరారు. దీనివల్ల చాలా మంది ధ్రువపత్రాలు పొందలేక సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారని చెప్పారు. సమస్య పరిష్కారానికి జెసి సానుకూలంగా స్పందించారని నాయకులన్నారు.

## బాల్య వివాహాలను అరికట్టాలి

**ప్రజాశక్తి - అమరావతి :** బాల్య వివాహాలను ముందుగానే గుర్తించి నిలువరించాలని ఎంపిడిఒ టి.పార్వతి చెప్పారు. బేటీ బచావో కార్యక్రమంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సమావేశమయ్యారు. ఎంపిడిఒ మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు.

## పడవలకు 12న వేలం

**ప్రజాశక్తి - అమరావతి :** మండలంలోని దిడుగు, ధరణికోట గ్రామాల్లో పడవల వేలం 12వ తేదీన నిర్వహిస్తామని ఎంపిడిఒ టి.పార్వతి గురువారం తెలిపారు. జిల్లా పరిషత్ ఆదేశాల మేరకు జరిగే వేలంలో భాగంగా 12వ తేదీ ఉదయం 10 గంటల నుండి ఒంటిగంట వరకు టెండర్లు స్వీకరిస్తామని, రెండు గంటల తర్వాత వేలం ఉంటుందని చెప్పారు. వివరాల కోసం గుంటూరు జెడ్‌పి కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

# ఎలక్ట్రానిక్ వ్యర్థాలతో పర్యావరణానికి ముప్పు

**ప్రజల్లో అవగాహన కల్పించడానికి యువత ముందుకు రావాలి : ఎస్ఆర్ఎం సదస్సులో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ**

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

ఎలక్ట్రానిక్ వ్యర్థాలతో (ఈ-వేస్ట్) పర్యావరణానికి తీవ్ర ముప్పు వాటిల్లుతోందనీ, వీటివల్ల ఎదురయ్యే అనర్థాల గురించి ప్రజల్లో అవగాహన పెంచేందుకు యువత నడుం బిగించాలని గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి పిలుపు నిచ్చారు. ప్రముఖ సెల్‌ఫోన్‌ల తయారీ కంపెనీ ఒప్పో ఇండియాతో కలిసి ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ గురువారం ఈ-వేస్ట్ ప్రత్యేక అవగాహనా సదస్సు నిర్వహించింది. పలు పాఠశాలల విద్యార్థులతో పాటు ఎన్విరాన్మెంటల్ సైన్స్ ఇంజినీరింగ్ విద్యార్థులు సదస్సుకు హాజరయ్యారు. దృశ్య మాధ్యమ పద్ధతిలో వీడియో సందేశాన్ని పంపిన కలెక్టర్ నాగలక్ష్మి ఈ వేస్ట్ వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ, ఏపీ ఎస్ఆర్ఎం. ఒప్పో కంపెనీల చొరవను ప్రశంసించారు. గ్రామీణ ప్రాంతాల్లోని స్వచ్ఛంద సంస్థలు, మహిళా సంఘాలు సమస్యను పరిష్కరించడంలో భాగస్వాములు కావాలని సూచించారు. విశిష్ట అతిథిగా హాజరైన ఒప్పో ఇండియా కంపెనీ ప్రజా వ్యవహారాల విభాగం అధిపతి రాకేశ్ భరద్వాజ్ మాట్లాడుతూ. ప్రపంచ వ్యాప్తంగా సెల్ఫోన్ల తయారీలో రెండో స్థానంలో ఉన్న భారత్ ఈ-వేస్ట్ రీసైక్లింగ్‌లో వెనుకబడి ఉన్నామన్నారు. సదస్సు తదనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో రాకేశ్ భరద్వాజ్ పలు వివరాలను వెల్లడించారు. పర్యా వరణ పరిరక్షణ కోసం ఒప్పో కంపెనీ రెడ్యూస్, రీయూజ్, రీ సైకిల్ అనే మూడు సూత్రాలను పాటిస్తుందన్నారు. ఈ వేస్ట్ మేనేజ్మెంట్‌లో భాగంగా ఎక్కువ కాలం మన్నే సెల్ ఛార్జర్లు, ఇతరత్రా గాడ్జెట్లను తయారు చేస్తున్నామన్నారు. ప్రపంచ వ్యాప్తంగా రోజుకు 50 మిలియన్ టన్నుల ఈ వేస్ట్ పేరుకుపోతుందనీ, దీన్ని ఎప్పటికప్పుడు తగ్గించకపోతే పర్యావరణానికి ప్రమాదం ఏర్పడే అవకాశాలు ఉన్నాయన్నారు. దక్షిణాది రాష్ట్రాల్లోని ఐదారు విద్యా సంస్థలతో కలిసి ప్రజల్లో ఈ వేస్ట్ అవగాహనకు కృషి చేస్తున్నామన్నారు. యూనివర్సిటీ ఇన్చార్జి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ భరద్వాజ్ శివకుమారన్, డీన్ డాక్టర్ సీవీ టామి, ఎన్విరాన్మెంట్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగం అధిపతి డాక్టర్ రంగభాష్యం, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ డెబ్లినా దుత్త ప్రసంగించారు. ఈ సందర్భంగా ఈ వేస్ట్ సేకరణ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక బాక్సును ప్రారంభించారు. ఈ వేస్ట్ వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ విద్యార్థులు ప్రదర్శించిన దశ్య రూపకం ఎంతగానో ఆకట్టుకుంది.

డిఇఒకు స్కార్ఫ్, జెండా ప్రతిమను అందజేస్తున్న ఇంటెల్ విద్యార్థులు

## ఇంటెల్‌లో ఘనంగా స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - మేడికొండూరు

మండలంలోని పేరేచర్ల ఇంటెల్ హైస్కూల్లో గురువారం భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ 75వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్కూల్లో స్కౌట్స్ విద్యార్థులు ప్రత్యేక పరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ డాక్టర్ కోనూరి జయ కుమార్ మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్ వలన విద్యార్థులకు చిన్నతనం నుండే క్రమశిక్షణ, నిబద్ధత అలవడుతుందని తెలిపారు. అనంతరం విద్యార్థులు గౌరవ సూచికంగా గుంటూరులోని జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయానికి వెళ్లి డిఇఒ సివి కళ్యాణికి స్కార్ఫ్, జెండా ప్రతిమను అందజేసి 75వ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమం ప్రాముఖ్యతను తెలిపారు. కార్యక్రమంలో ఇంటెల్ స్కూల్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు, గుంటూరు జిల్లా ఏ ఎస్ ఓ సి షేక్ నజీర్ , గైడ్ కెప్టెన్ కమలా దేవి ,ఇంటెల్ స్కూల్ పిడి, స్కౌట్ మాస్టర్ షేక్ రన్ను హుస్సేన్, తదతరులు పాల్గొన్నారు.

## విద్యుత్ భారం తగ్గించాలని సిపిఐ ధర్నా

ప్రజాశక్తి - మంగళగిరి

విద్యుత్ భారాలు ప్రజలపై మోపకుండా ప్రభుత్వం ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం మంగళగిరి పట్టణంలోని గండాలయ్యపేటలో గల విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జంగాల మాట్లాడుతూ ప్రజల పై మోపుతున్న విద్యుత్ చార్జీల భారాన్ని ప్రభుత్వమే భరించాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలు గడవకముందే రూ. 17 వేల కోట్ల విద్యుత్ భారాన్ని మోపారని విమర్శి ంచారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు చిన్ని తిరు పతయ్య, జాలాది జాన్ బాబు, నందం బ్రహ్మే శ్వరరావు, చిన్ని సత్యనారాయణ, ఉడత శ్రీనివాసరావు, కాబోతు ఈశ్వ రరావు, ఎస్కే కరీముల్లా, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

గండాలయ్యపేటలో విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద సిపిఐ ధర్నా

## 104 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - చేబ్రోలు

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చేబ్రోలు 104 ఉద్యోగులు గురువారం డిప్యూటీ డిఎంహెచ్ఓ మరియు 104 నోడల్ ఆఫీసరు డాక్టర్ అన్నపూర్ణ, స్థానిక పి హెచ్ సి డాక్టర్ సి హెచ్ శైలజ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ గత మూడు నెలలు నుండి వేతనాలివ్వక పోవడంతో ఆర్థికంగా తీవ్రంగా ఇబ్బంది పడుతున్నామని అన్నారు. కుటుంబాలను పోషించటం చాల కష్టం అవుతుందని ఆవేదనను వ్యక్తం చేశారు. 2020 తరువాత విధుల్లో చేరిన డ్రైవర్ మరియు డి.ఈ.ఓ కు జీవో 7 ద్వారా వేతనాలు ఇవ్వాలని కోరారు. అరబిందో యాజమాన్యం అక్రమంగా వసూలు చేసిన పి.యఫ్. పై ప్రభుత్వం చర్యలు తీసుకుని వెంటనే సిబ్బందికి చెల్లించాలిని అన్నారు. 74 మంది సీనియర్ డ్రైవర్లకు స్లాబ్ అమలు చెయ్యాలని కోరారు. డి.యస్సి ద్వారా నియమితులు అయిన

సీనియర్ డ్రైవర్‌లను కాంట్రాక్టులో పెట్టాలని, ఉద్యోగులందరికి మెడికల్ ఇన్సూరెన్స్ చేయించాలని కోరారు. ఉద్యోగులకు యాజమాన్యం నుండి రావలసిన బకాయిలు చెల్లించే విధంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుని 104 ఉద్యోగులకు న్యాయం చెయ్యాలి అని కోరారు. కార్యక్రమంలో జిల్లా అద్యక్షులు కె సత్యరాజ్, గాజులవర్తి అమర్ చంద్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రీ రిపబ్లిక్‌డే పరేడ్‌కు ఎఎన్‌యు విద్యార్థులు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

వర్సిటీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ కు ఎంపికయ్యారని ఎన్ ఎస్ ఎస్ ఇన్చార్జి ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ వి. దివ్య తేజోమూర్తి తెలిపారు. జలగాన్ లోని కె. బి సి నార్త్ మహారాష్ట్ర యునివర్సిటీలో ఈనెల 12నుంచి 24 వరకు ఈ పెరేడ్ జరుగుతుందని తెలిపారు. ఈ వేడుకలకు ఆంధ్రప్రదేశ్ నుంచి 44 మంది విద్యార్థులు పాల్గొంటున్నారని, వర్సిటీ అనబంధ కళాశాలల నుండి నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఆర్కిటెక్చర్ కళాశాల నుంచి ఎం. శిరీష, తెనాలి జె . ఎం.జె మహిళా కళాశాల నుంచి జి. చంద్రిక, గుంటూరు హిందూ కళాశాల నుంచి సిహెచ్. రుత్విక్ బాబు, బిఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి ఏ. గణేష్ ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను విశ్వవిద్యాలయ తాత్కాలిక ఉప

కులపతి ఆచార్య కే. గంగాధరరావు అభినందించారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు మానసిక పరివర్తనతో పాటు క్రమశిక్షణ, మానవత్వం పెంపొందించడంలో జాతీయ సమగ్రతను కాపాడటంలో ముందుంటున్నారన్నారు. కార్యక్రమంలో రెక్టర్ ఆచార్య కే . రత్న షీలా మణి, రిజిస్ట్రార్ జి. సింహాచలం, ఓఎస్డి ఆచార్య ఆర్ వి ఎస్ ఎస్ ఎన్ రవికుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డి. శ్రీనివాస రావు, ఆచార్య కె.వి నిరూపమ, తదితరులు పాల్గొన్నారు.

## పొలాల్లో మితిమీరుతున్న మందుబాబుల ఆగడాలు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

పచ్చని పంట పొలాలలో రోజు రోజుకి మందుబాబుల ఆగడాలు ఎక్కువవుతు న్నాయి. సాయంత్రం 7:00 అయితే చాలు పొలిమేర డొంకలలో ఎక్కడ చూసినా మందు బాబుల హడావుడి. ఎంటిఎంసీ పరిధిలోని కుంచనపల్లి, గుండిమెడ, మెల్లం పూడి, గ్రామాల పొలిమేర డొంకలలో మద్యం సీసాలతో మందు బాబులు ఫుల్లుగా మద్యం సేవించి, తాగి పడేసిన సీసాలు పచ్చని పంట పొలాలలో దర్శనమిస్తున్నాయి. ప్రత్యేకంగా యువత పుట్టినరోజుల పేరుతో నాన యాగి చేస్తున్నారు. పగలంతా పొలాలలో పనులు చేసి, పచ్చని పంటలు పండిస్తున్న రైతులు, కౌలు రైతులు మరుసటి ఉదయం పొలాలలోకి వెళ్లేసరికి పగిలిన మద్యం, బీరు సీసాలు, వాటర్ ప్యాకెట్లు చిందరవందరగా పడవేసి ఉండడం తో రైతులు గగ్గోలు పెడుతున్నారు. పొలాలకు నీళ్లు మళ్లించే క్రమంలో గాజు పెంకులు కాళ్లకు గుచ్చుకొని, గాయాలు అవుతున్నాయని రైతులు ఆందోళన చెందు తున్నారు. జాతీయ రహదారికి పక్కన ఉన్న కుంచనపల్లి వంటి గ్రామ పరిధిలోనీ ఏ డొంకలో చూసిన మద్యం సీసాలు దర్శనమిస్తున్నాయి. తక్షణమే సంబంధిత తాడేపల్లి పోలీస్ అధికారులు స్పందించి, మందుబాబులు ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని, రాత్రి వేళలో పొలిమేర డొంకలలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకో వాలని పలువురు గ్రామ కౌలు రైతుల కోరుతున్నారు.

## రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

రోటరీ క్లబ్ తెనాలి, ఏషియన్ వాస్కులర్ హాస్పిటల్స్ హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత రక్తనాళాల వైద్య పరీక్షలు నవంబర్ 10న నిర్వహిస్తున్నట్లు రోటరీ క్లబ్ అధ్యక్షులు ఈదర శ్రీనివాసరావు తెలిపారు. రోటరీ క్లబ్ కార్యాలయంలో గురువారం మీడియాతో ఆయన మాట్లాడుతూ సుమారు ఐదు వేలు విలువైన వైద్య పరీక్షలు శిబిరంలో ఉచితంగా నిర్వహిస్తారని, బస్టాండ్ అవుట్ గేట్ ఎదురుగా ఈగల్ రెస్టారెంట్ వద్ద నిర్వహించబడుతుందని తెలిపారు. కార్యక్రమంలో రోటరీ సభ్యులు కన్నెగంటి మురళీకృష్ణ, నల్లూరి వెంకటేశ్వరరావు, ప్రవీణ్, ఉపేంద్ర, మహేష్, హాస్పటల్‌హెడ్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రారంభ దశలో గుర్తిస్తే ప్రాణాలకు రక్షణ

**కేన్సర్ పై మంగళగిరిలో అవగాహన ర్యాలీ**

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరిలో జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం పురస్కరించుకొని స్థానిక గణపతి నగర్లోని ఇందిరా నగర్ యూపీహెచ్సీ ఆధ్వర్యంలో గురువారం క్యాన్సర్ పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పీ అనూష మాట్లాడారు. క్యాన్సర్ గురించి స్క్రీనింగ్ చేసుకో వాలని ప్రజల్లో అవగాహన కల్పించడానికే ర్యాలీ ముఖ్య ఉద్దేశమన్నారు. పొగ, మద్యంకు దూరంగా ఉండాలన్నారు. ప్రతిరోజు వ్యాయామం చేస్తూ మంచి ఆహారం తీసుకుంటూ బరువు నియంత్రణలో ఉంచుకోవాలన్నారు. 14వ తేదీ నుంచి ఏఎన్ఎంలు, ఆశాలు ఇంటింటికి తిరిగి నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్లపై స్క్రీనింగ్ చేస్తారని వారికి ప్రజలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎయిమ్స్ వైద్యులు డాక్టర్ విష్ణు, ఏఎన్ఎంలు, ఆశాలు, హెల్త్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

## పెదనందిపాడులో మానవహారం

ప్రజాశక్తి - పెదనందిపాడు

జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా మండల వైద్యాధికారి డాక్టర్ జి లావణ్య ఆధ్వర్యం లో అందరికి ఉచితంగా క్యాన్సర్ పరీక్షలు పై గ్రామ ప్రజలకు అవగాహన కలిగించుటకు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమం లో సి హెచ్ ఓ ప్రసాద స్వామి, వైద్య సిబ్బంది సుజాత, చెన్నయ్య, అరుంధతి తదితరులు పాల్గొన్నారు.

## త్వరలో ఇంటింటి కేన్సర్ సర్వే

ప్రజాశక్తి - దుగ్గిరాల : ప్రారంభ దశలోనే క్యాన్సర్ లక్షణాలు గుర్తించినట్లయితే జబ్బు బారిన పడకుండా స్వస్థత పొందవచ్చునని స్థానిక పి హెచ్ సి డాక్టర్ సి ఇందిరా అన్నారు. జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా గురువారం పి.హెచ్.సి లో ప్రజలకు క్యాన్సర్ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించి ర్యాలీ నిర్వహించారు.అనంతరం ఆమె మాట్లాడుతు త్వరలో క్యాన్సర్ స్క్రీనింగ్ ప్రోగ్రాం ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రతి ఇంటికి వచ్చి ఏఎన్ఎంలు సర్వే చేస్తారని ఆరోగ్యం విషయంలో వారు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది జానమ్మ శ్రీ లక్ష్మీ భాగ్య లలిత కుమారి శాంతి శ్రీనివాసరావు నటరాజు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## రేపటి నుండి ఓటర్ల జాబితా సవరణ

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి నియోజకవర్గంలో ముసాయిదా ఫోటో ఓటర్ల జాబితా 2025 సవరణ కార్యక్రమంలో భాగంగా ఈనెల 9, 10, 23, 23 తేదీలలో ప్రత్యేక ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్నట్లుగా మంగళగిరి అసెంబ్లీ నియోజక వర్గం ఓటర్ నమోదు అధికారిని ఏ లక్ష్మి కుమారి గురువారం తెలిపారు. మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గం లోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద సంబంధిత బిఎల్ఓలు ముసాయిదా ఫోటో ఓటర్ల జాబితాతో అందుబాటులో ఉంటారని తెలిపారు. అర్హత ఉండి పేర్లు లేకపోతే వెంటనే ఫారం 6ను పూర్తిచేసి బిఎల్ఓ లకు అందజేయవచ్చునని తెలిపారు. మరణించిన వారు గాని, గ్రామంలో నుండి శాశ్వతంగా వలస వెళ్లిన వారిగాని ఉంటే ఫారం 7, 8 పూర్తి చేసి సవరించుకునే అవకాశం ఉందని ఆమె తెలిపారు.

## బాలకుటీర్ రెండోతరగతి చిన్నారి శ్రీవల్లికి ప్రపంచపటంపై పట్టు

ప్రజాశక్తి-గుంటూరు

టాలెంట్ సెర్చ్ ఫౌండేషన్, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ హైదరాబాద్ నిర్వహించిన పోటీల్లో శ్రీ వెంకటేశ్వరా బాలకుటీర్ విద్యార్థిని విష్ణుమొలకల కోమలశ్రీవల్లి ప్రపంచ పటంలోని 42 ప్రదేశాలు గుర్తించటమే కాకుండా 25 వైద్య పరిభాష పదాలు గుర్తించి ఒక్క నిముషంలో చెప్పిందని బాలకుటీర్ వ్యవస్థాపకురాలు డాక్టర్ మంగాదేవి తెలిపారు. ఈ సందర్భంగా శ్రీవల్లికి మంగాదేవి అభినందనలు తెలిపారు. శ్రీవల్లి చేతనలోని వెంకటేశ్వరా బాలకుటీర్‌కు చెందిన ఉషోదయ ఇంగ్లీషు మీడియం స్కూల్లో రెండో తరగతి చదువుతుందన్నారు. బాలల్లో వివిధ అంశాల పట్ల ఆసక్తి చిన్న వయస్సులోనే గుర్తించి ప్రోత్సహించాలన్నారు. శ్రీవల్లిని ఆ దిశలో ప్రోత్సహించిన తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను బాలకుటీర్ సిఎఒ రఘురాం, సహకార్యదర్శి జయశ్రీ, చేతన నిర్వాహకురాలు మరుద్వతి, ప్రిన్సిపాల్ నజ్రీన్, లక్ష్మీప్రసన్న, వెంకటేశ్వరరావు అభినందించారు.

## లాసెట్ అడ్మిషన్ల రిపోర్టింగ్ గడువు పెంపు

**ప్రజాశక్తి - ఎఎన్‌యు :** ఏపీ లాసెట్ 2024 ప్రవేశాలకు సంబంధించి సీట్లు పొందిన విద్యార్థులు ఆయా కళాశాలలో రిపోర్ట్ చేసే గడువు తేదీని ఒక రోజు పొడిగించినట్లు లా సెట్ అడ్మిషన్ల కన్వీనర్ ప్రొఫెసర్ బి. సత్య నారాయణ తెలిపారు. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈనెల 7వ తేదీతో ముగిసిందని, విద్యార్థుల కోరిక మేరకు 8వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు పేర్కొన్నారు. ఎవరైన లాసెట్ విద్యార్థులు కళాశాలల్లో రిపోర్ట్ చేయనట్లయితే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు ఏపీ లా సెట్ వెబ్ సైట్‌ను చూడాలని పేర్కొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి నారాలోకేష్

## దేశానికే తలమానికంగా విద్యారంగం

### మానవ వనరుల అభివృద్ధి, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్

ప్రజాశక్తి - తుళ్ళూరు

రానున్న ఐదేళ్లలో దేశానికే తలమానికంగా రాష్ట్ర విద్యారంగాన్ని అభివృద్ధి చేస్తామని మానవ వనరుల అభివృద్ధి, ఐటి శాఖా మంత్రి నారా లోకేష్ చెప్పారు. రాజధాని అమరావతిలోని విఐటి విశ్వవిద్యాలయంలో ఇంటర్నేషనల్ హైయ్యర్ ఎడ్యుకేషన్ ఫెయిర్‌ను గురువారం మంత్రి ప్రారంభించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న 50కి పైగా ప్రసిద్ది చెందిన అంతర్జాతీయ విశ్వవిద్యాలయాల ప్రతినిధులు పాల్గొన్న సదస్సులో లోకేష్ మాట్లాడుతు తాను స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం చదువుకున్నప్పటి విషయాలను విద్యార్థులతో పంచుకున్నారు. వికసిత్ భారత్ స్ఫూర్తితో రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు వికసిత్ ఆంధ్రప్రదేశ్ 2047 వైపు అడుగులు వేస్తున్నామని తెలిపారు. విసి డాక్టర్ జి విశ్వనాథన్ మాట్లాడుతూ భారతదేశంలో ఉన్నత విద్యలో స్థూల నమోదు నిష్పత్తి పెరగాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామీణ ప్రాంతంలో ఇంటర్మీడియట్‌లో ప్రథమ స్థానంలో నిలిచిన నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులకు విఐటిలో ఉచిత విద్యను అందిసున్నట్లు తెలిపారు. ఉన్నత విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వానికి సహాయ సహకారాలు అందించేందుకు విఐటి విశ్వవిద్యాలయం ఎల్లప్పుడూ ముందుంటుందని తెలియ జేశారు. వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎస్ వి కోట రెడ్డి మాట్లాడుతూ విశ్వవిద్యాలయం సాధిస్తున్న ప్రగతిని వివరించారు. కార్యక్రమంలో విఐటి ఉపాధ్యక్షులు శంకర్ విశ్వనాథన్, డాక్టర్ శేఖర్ విశ్వనాథన్, ఇంటర్నేషనల్ డైరెక్టర్ డాక్టర్ ఆర్ శ్రీనివాసన్, రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్ చంద్ర ముదిగంటి, ఇంటర్నేషనల్ రిలేషన్స్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ దేబాజిత్ గోస్వామి, డాక్టర్ సన్నీ దయాళ్, డాక్టర్ జె సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## నీకేం కావాలో నువ్వే తెలుసుకోవాలి

### విజ్ఞాన్‌లో విద్యార్థులకు మోటివేషన్ సెషన్‌లో కెవి ప్రదీప్

ప్రజాశక్తి-గుంటూరు

మాట్లాడుతున్న కె.వి.ప్రదీప్

విద్యార్థులు తమ జీవితంలో ఏం కావాలో వాళ్లే తెలుసుకోవాలని ప్రముఖ మోటివేషనల్ స్పీకర్, ఫిల్మ్, టెలివిజన్ యాక్టర్ కేవీ.ప్రదీప్ అన్నారు. విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో బీటెక్ నాలుగో సంవత్సరం విద్యార్థులకు 'టేక్ ఆఫ్ టు టేక్ ఓవర్' అనే అంశంపై గురువారం మోటివేషనల్ సెషన్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ మోటివేషనల్ స్పీకర్, ఫిల్మ్, టెలివిజన్ యాక్టర్ కేవీ.ప్రదీప్ మాట్లాడుతూ జీవితంలో ఉన్నతంగా ఎదగాలంటే విలువలు, బలం, వైఖరి, నైపుణ్యాలు, జ్ఞానం అనే ఐదు లక్షణాలను అలవర్చుకోవాలన్నారు. యూనివర్సిటీలో చివరి సంవత్సరం చదువుతున్నప్పుడు జరిగే క్యాంపస్ డ్రైవ్‌లోనే ఉద్యోగం సాధిస్తే చాలా వరకు ఒత్తిడి తగ్గుతుందన్నారు. విద్యార్థులందరూ మీలో ఉన్న భావాలను ఇతరులతో పంచుకుని మెప్పిస్తే కమ్యూనికేషన్ స్కిల్స్‌లో మీరు ముందంజలో ఉన్నట్లు భావించాలన్నారు. వీలైనంత వరకు సోషల్ మీడియా మాధ్యమాలను పరిమిత సమయం విధించుకొని వినియోగించాలన్నారు. ప్రస్తుతం కంపెనీలన్నీ ఇండస్ట్రియల్ రెవెల్యూషన్ 4.0ను అనుసరిస్తున్నందు వలన విద్యార్థులందరూ కొత్త టెక్నాలజీని వేగంగా నేర్చుకునేవారే జీవితంలో ముందుకు రాగలరన్నారు. అంతేకాకుండా ఇంటిగ్రిటీ, నిజాయితీ, టెక్నికల్ స్కిల్స్, స్మార్ట్ థింకింగ్, పాజిటివ్ మెంటల్ ఆటిట్యూడ్, లీడర్‌షిప్ లక్షణాలు, నెట్ వర్కింగ్, కాన్ఫిడెన్స్, కమ్యూనికేషన్, సబ్జెక్ట్ మీదపట్టు, బాడీ లాంగ్వేజ్ మీద కూడా పట్టు సాధించాలన్నారు.కార్యక్రమంలో ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# జిజిహెచ్‌లో వసతులు పెంచుతాం : కేంద్ర మంత్రి పెమ్మసాని

### అర్బన్ హెల్త్ సెంటర్లు, పిహెచ్‌సిల అభివృద్ధికి కృషి

బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి పెమ్మసాని తదితరులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిని మరో ఏడాది లోపు ప్రైవేట్ సూపర్ స్పెషలిటీ హాస్పిటల్ లాగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొంది స్తున్నట్టు కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి సొసైటి (హెచ్.డీ.ఎస్) సమా వేశంలో ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన మౌలిక సౌకర్యాల కల్పన, అవుట్ పేషెంట్ల సంఖ్యను క్రమబద్ధీకరించడం , ప్రైమరీ హెల్త్ సెంటర్లు , అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లను మరింత బలోపేతం చేయడంపై తీసుకోవలసిన చర్యలపై చర్చించారు. గుంటూరు, తెనాలిలో జన ఔషదీ కేంద్రాలను ఏర్పాటు చేయడం, సర్వీస్ బ్లాక్ పనులు పూర్తి చేయడం, బొంగరలాబీడులోని ఆరు ఎకరాల భూమికి ఫెన్సింగ్ ఏర్పాటు వంటి అంశాలపై సమావేశంలో చర్చించారు. 'సాహెూ' అనే పేరుతో ప్రత్యేక ప్రణాళిక ద్వారా గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి ముందు కు వెళున్నామన్నారు. జీజీహెచ్‌కు రోజుకు వెయ్యి మంది రోగులు అవుట్ పేషెంట్లుగా వస్తున్నారని, ఈ సమస్యను పరిష్కరించేందుకు గ్రామీణ ప్రాంతంలోని ప్రైమరీ హెల్త్ సెంటర్లు మరియు జిల్లాలో వున్న 27 అర్బన్ హెల్త్ సెంటర్లను క్రియాశీలకంగా చేయడం వల్ల జీజీహెచ్ కు ఒత్తిడి తగ్గుతుందన్నారు. గ్రామీణ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలో ప్రజలకు చికిత్సలు చేసేందుకు తగిన మౌలిక వసతులను కల్పిస్తామన్నారు. జిజిహెచ్‌లో హెచ్‌డిఎఫ్‌సీ బ్యాంక్ వారు సీఎస్ఆర్ క్రింద రూ. 65 లక్షల విలువగల అప్తాల్మజీ పరికరాలను అందిస్తున్నట్లు తెలిపారు. యంసిహెచ్ కు సంబంధించి అవసరమైన ఎక్విప్మెంట్ కు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం జరిగిందని తెలిపారు. సర్వీస్ బ్లాక్ నిర్మాణానికి గతంలో రూ. 5 కోట్లను తులసి రామచంద్ర ప్రభు వితరణ చేశారన్నారు. మరో కోటి తన స్నేహితుని ద్వారా తీసుకువస్తామన్నారు. నర్సింగ్ విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించడానికి తులసి రామ చంద్రప్రభు రూ.50లక్షలతో బస్సు ఏర్పాటు చేస్తామని భరోసా ఇచ్చారన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు మహమ్మద్ నసీర్ అహ్మద్ మాట్లాడుతూ పేద ప్రజలకు మరింత ఉపయోగపడే వసతులు పెంచాలన్నారు. పార్కింగ్ సమస్య, సర్విస్ బ్లాక్ అభివృద్ధి , యుపిహెచ్ఎస్ లకు స్పెషాలిటీ డాక్టర్లు విజిట్ చేసే విధం, మార్చురీ, బ్లడ్ బ్యాంక్ బిల్డింగ్ , ఇన్ పేషెంట్ లకు ఖచ్చితమైన లాబొరేటరీ టెస్టులు వంటి వాటిపై చర్చించడం జరిగిందన్నారు. ప్రతి విభాగంలోను కంప్లయింట్ బాక్సులకు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, కమిషనర్, కమిటీ సభ్యులు రామచంద్ర ప్రభు, డాక్టర్ హరిత, జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ సుందరాచారి తదితరులు పాల్గొన్నారు.

**సీఎంఆర్ఎఫ్ రిలీఫ్ ఫండ్ చెక్ అందజేత**

కాలేయ సమస్యతో బాధపడుతున్న గుంటూరుకు చెందిన కటాలి లక్ష్మణ ఆదిత్య (12)కు ఇటీవలే కాలేయ మార్పిడి జరిగింది. ఆదిత్య కుటుంబ ఆర్థిక సమస్యల కారణంగా సిఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ. 7 లక్షల చెక్కును పెమ్మసాని చంద్రశేఖర్, జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అహ్మద్ అందచేశారు.

# 18 వరకూ టెన్త్ పరీక్ష ఫీజు చెల్లింపునకు గడువు

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో మార్చిలో జరిగే పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు నవంబర్ 18 వరకూ ఎటువంటి అపరాధ రుసుం లేకుండా పరీక్ష ఫీజు చెల్లించవచ్చని జిల్లా విద్యాశాఖ అధికారి సి.వి.రేణుక ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని సబ్జెక్టులకు కలిపి రూ.125లు, మూడు సబ్జెక్టుల కంటే తక్కువ ఉంటే రూ.110లు సంబంధిత ప్రధానోపాధ్యాయులకు చెల్లించాలన్నారు. 19-25వ తేదీ వరకూ రూ.50లు, 26-డిసెంబర్ 3వ తేదీ వరకూ రూ.200లు, డిసెంబర్ 4-10వ తేదీ వరకూ రూ.500ల అపరాధ రుసుంతో ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. అలాగే వయస్సు మినహాయింపు కోసం రూ.300లు సిఎఫ్ఎంఎస్ చలానా చెలించాలన్నారు. కావున విద్యార్థులు సకాలంలో పరీక్ష ఫీజు చెల్లించాలని కోరారు.

### నేడు హెచ్‌ఎంల సమావేశం..

జిల్లాలో పనిచేస్తున్న ప్రభుత్వ, జెడ్పీ, ఎపిఆర్ఎస్, ఎసి సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, మున్సిపల్, ఇతర అన్ని యాజమాన్యాల పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశం శుక్రవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సాయంత్రం 4.30 గంటలకు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి సి.వి.రేణుక ఒక ప్రకటనలో తెలిపారు.ఱీ సమావేశానికి కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్ హాజరవుతారన్నారు. గత మూడు సంవత్సరాల పదో తరగతి పరీక్షల ఫలితాలు, రాబోయే పరీక్షల ప్రణాళిక తదితర అంశాలపై చర్చించటం జరుగుతుందని, కావున హెచ్‌ఎంలు సకాలంలో హాజరు కావాలన్నారు.

రాజధాని రైతు అనుమోలు గాంధీతో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

## రైతుల ఇళ్లకు మంత్రి నారాయణ

ప్రజాశక్తి - తుళ్లూరు

పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి నారాయణ స్వయంగా రైతుల ఇళ్లకు వెళుతున్నారు. ల్యాండ్ పూలింగ్ పట్ల రైతుల్లో ఉన్న అనుమానాలను నివృత్తి చేసేందుకు మంత్రి సిఆర్‌డిఎ అదనపు కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్‌తో కలిసి రైతులను నేరుగా కలుస్తున్నారు. విజయవాడలో నివాసముంటున్న రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరు మండలం లింగాయపాలెంకు చెందిన రైతు అనుమోలు గాంధీని మంత్రి గురువారం కలిసి ల్యాండ్ పూలింగ్ ప్రయోజనాలు, అపోహలు గురించి వివరించారు. ఇప్పటికే మంత్రి రాజధాని గ్రామాల్లో పలువురు రైతుల ఇళ్లకు స్వయంగా వెళ్లి పూలింగ్ అంగీకార పత్రాలు స్వీకరించిన సంగతి తెలిసిందే. లాండ్ పూలింగ్‌లో భూములు ఇవ్వని కారణంగా రాజధాని డిజైనింగ్, ఇతర నిర్మాణాలకు కొంతమేర ఇబ్బంది కలుగుతుందని, రైతులు భూములు ఇచ్చేందుకు ముందుకు వస్తే ప్రభుత్వం వద్ద ఉన్న భూముల్లో కోరుకున్న చోట ప్లాట్లు కేటాయించడం జరుగుతుందని మంత్రి రైతులకు నచ్చజెప్పుతున్నారు. మంత్రి వెంట తుళ్లూరు మాజీ జెడ్పిటీసీ బెజవాడ రమేష్ బాబు తదితరులున్నారు.

విద్యార్థినులను అబినందిస్తున్న కళాశాల సెక్రెటరీ తదితరులు

## వెయిట్ లిఫ్టింగ్‌లో టిజెపిఎస్ విద్యార్థినుల ప్రతిభ

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక టిజెపిఎస్ కళాశాల డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థినులు ఆచార్య నాగార్జునా విశ్వవిద్యాలయ అంతర కళాశాల ల మహిళల వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో పతకాలు సాధించ్చినట్లు కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్.యస్.అనితా దేవి తెలిపారు. జి.శతి 64 కేజీల విభాగంలో ద్వితీయ స్థానం, జి.లావణ్య లహరి 74 కేజీల విభాగంలో తతీయ స్థానం పొందారని పేర్కొన్నారు.గురువారం కళాశాలలో విద్యార్థినులను కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ కె.వి.బ్రహ్మం అభినందించారు. ఈ సందరంగా సెక్రెటరీ మాట్లాడుతూ ఆధునిక మహిళ చరిత్రను పునర్లికిస్తుంది అన్న గురజాడ అప్పారావు మాటలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. ప్రతిభ ఉన్న విద్యార్థులను ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో కోచ్ కె.ఉదయ్‌కిరణ్, వ్యాయామ అధ్యాపకులు ఆర్.శివాజి, వైస్ ప్రిన్సిపాల్ భాను మురళి, స్పోర్ట్స్ కమిటీ సభ్యులు ఆర్.జయశైలజ, డాక్టర్. జె. వి. సుధీర్ కుమార్ పాల్గొన్నారు